సంతాన సమస్యలపై ఆందోళన వద్దు - ఆధునిక వైద్యంతో పరిష్కారం

- ఉచిత ఫెర్టిలిటీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- డాక్టర్ విజిత రెడ్డి

సూర్యాపేట , నవంబర్ 5: వుదయం ప్రతినిధి



సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులు ఆందోళన చెందకుండా ఆధునిక వైద్య విధానాల ద్వారా తగిన చికిత్స పొందాలని కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ విజిత రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీహన్ ఆసుపత్రిలో సంతానం లేని దంపతుల కోసం ఉచిత ఫెర్టిలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజిత రెడ్డి మాట్లాడుతూ... సంతానలేమి సమస్యకు మహిళలే కారణమనే అపోహ సరైంది కాదని, భార్యాభర్తలు ఇద్దరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంతానలేమికి మహిళల్లోనే కాకుండా పురుషుల్లోనూ వివిధ కారణాలు ఉండవచ్చని తెలిపారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకుంటే సమస్యకు కారణాలను గుర్తించి తగిన చికిత్స అందించవచ్చన్నారు. ఆధునిక వైద్యరంగంలో సంతాన సాఫల్యానికి అనేక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సంతాన సమస్యలపై ఎలాంటి సంకోచం, అపోహలు పెట్టుకోకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని కోరారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట పట్టణ ప్రజలు, సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శైలజ, సురేష్, స్వప్న, శ్రావ్య, హాస్పిటల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అభివృద్ధి పనులకే ప్రాధాన్యం

అధికారులకు మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్05 (వుదయం ప్రతినిధి)



జిల్లాలో వీబీ–జీ రామ్ జీ పథకం ద్వారా తాత్కాలిక పనులకు బదులుగా ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మురసు తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వీబీ–జీ రామ్ జీ పథకం కింద అందుబాటులో ఉన్న 375 రకాల పనులను సమర్థవంతంగా వినియోగించుకొని శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. చెరువులు, పంట కాలువల పూడికతీత, చెరువుకట్టల పటిష్టత, గ్రామీణ అంతర్గత రహదారులు, వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గాలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను ఈ పథకం కింద ప్రతిపాదించాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, రహదారులు–భవనాలు, నీటిపారుదల శాఖలకు సంబంధించిన అర్హమైన పనులను కూడా ఈ పథకం కింద ప్రతిపాదించాలని తెలిపారు. రహదారుల మరమ్మతులు, కంకర పనులు, కల్వర్టులు, వంతెనలు, కాలువల పునరుద్ధరణ, అసంపూర్తి పనులను గుర్తించి కలెక్టర్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పనుల మంజూరుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

తుపాను నష్టాలపై ప్రత్యేక దృష్టి

మురసు తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టాలను నిబంధనల ప్రకారం నమోదు చేయడంతో పాటు దెబ్బతిన్న మౌలిక సదుపాయాలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు.

ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో వర్షాల ప్రభావం అధికంగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు శాశ్వత పరిష్కారాలు చూపాలని, అవసరమైన ప్రాంతాల్లో గేబియన్ నిర్మాణాల చేపట్టే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 56 ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, ఇతర నిర్మాణాల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భద్రాచలం–వెంకటాపురం రహదారి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని, టెండర్ల ప్రక్రియ పూర్తయినందున వెంటనే జీఎస్‌బీ పనులు ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఇసుక రవాణా కారణంగా రహదారులు మరింత దెబ్బతినకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో చిన్నపాటి నష్టాలకు తక్షణ మరమ్మతులు చేపట్టి, మంజూరైన పనులను వాతావరణం అనుకూలించిన వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

శాశ్వత పరిష్కారాలకు కార్యాచరణ

మల్లెపువ్వుల వాగు పరిధిలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపను తొలగించి పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వాగు వంతెన ప్రారంభ ప్రాంతం నుంచి వంతెన వరకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి నీటి నిల్వకు అనుకూలంగా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు.

ప్రతి పంట కాలంలో తాత్కాలిక పనులు చేపట్టి తొలగించే పరిస్థితి లేకుండా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు అభివృద్ధి పనుల కోసం విడుదలైన రూ.70 లక్షలతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన డీపీసీ, నాన్–జీవో పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పునరుద్ధరణ పనులను కూడా ప్రతిపాదనల్లో చేర్చాలని సూచించారు. గంగారం ప్రాం తంలోని నీటి వనరులు, కాలువల అభివృద్ధి, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.

వేసవి తాగునీటికి ముందస్తు ఏర్పాట్లు

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం 36 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న నేపథ్యంలో ఇసుక బస్తాలతో చేపట్టిన రక్షణ ఏర్పాట్లను పరిస్థితులకు అనుగుణంగా కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన రెండు వరుసలకు అదనంగా అవసరమైతే ఐదు వరుసల వరకు రక్షణ ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు. యాతాలకుంట సొరంగ మార్గం లైనింగ్ పనులు మరో వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నందున ప్రయోగాత్మక నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీటి విడుదలకు అనుకూలమైన సమయంలోనే చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో తాగునీటి అవసరాల కోసం ఒక టీఎంసీ నీటిని నిల్వ ఉంచాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో ప్రభావంతో రానున్న జనవరి నుంచి కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, వ్యవసాయ రంగాలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. ములకలపల్లి, చంద్రుగొండ, రెడ్డిపల్లి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నందున మొక్కల సరఫరా, సాగు విస్తరణకు ఉద్యానవన శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి, మెట్ట పంటలతో పాటు జనుము, పిల్లిపెసర వంటి పశుగ్రాస పంటల సాగును కూడా ప్రోత్సహించాలని తెలిపారు.

విమానాశ్రయ నిర్మాణంపై సమన్వయం

జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూమి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టు తదుపరి చర్యల కోసం ఢిల్లీలోని సంబంధిత శాఖలతో సంప్రదింపులు కొనసాగించాలని తెలిపారు.

పట్టణాల సుందరీకరణకు చర్యలు

కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం, జూలూరుపాడు పట్టణాల్లో ప్రధాన రహదారుల మధ్య ఉన్న డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. జిల్లాలోని పట్టణాలు పచ్చదనంతో, పరిశుభ్రతతో సుందరంగా కనిపించేలా మొక్కలు నాటి వాటిని నిరంతరం సంరక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవిబాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):



రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్ ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ఉన్నతాదికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో చేపల వేటకు వెళ్లి వరదలో చిక్కుకున్న జాలర్లను రక్షించేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల పడవలు ప్రమాదానికి గురైన నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టి 11 మంది పోలీసులను సురక్షితంగా కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను చెరువు వద్ద అభినందించారు అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలో మురసు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న చెరువులు వాగులు రహదారులు మరియు పంట పొలాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని సమీక్షించి ప్రజలకు మరియు రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభిమానులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

17.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన సముదాయానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన

నల్గొండ మండలం నవంబర్ 05.

నల్లగొండ పట్టణంలో నూతన మండల స్థాయి సమీకృత కార్యాలయాల భవన సముదాయ నిర్మాణానికి 17.50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు.దీని వలన ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రానున్నాయి.ఈ కార్యక్రమంలో కలెక్టర్ చంద్రశేఖర్ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగాఅమరజీవి కామ్రేడ్ గుగులోతు ధర్మ వర్ధంతి

దమ్మపేట నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):

సిపిఎంపార్టీ మాజీ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు.మైదాన గిరిజన సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు అమరజీవి కామ్రేడ్ గుగులోతు ధర్మా 3. వ వర్ధంతి మండల కేంద్రమైన దమ్మపేటలో మండల కార్యదర్శి మోరంపూడిశ్రీనివాసరావుఅధ్యక్షతనజరిగింది మొట్టమొదట ధర్మా చిత్రపటానికి పూలమాల మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మి నారాయణ వేసి ఘనంగా నివాళులర్పించారు . తరువాత జరిగిన సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాతూ గుగులోతు ధర్మా తాను జీవితాంతం వరకు ఎర్రజెండా నుభుజానవేసుకొని మార్క్సిస్టు పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ పేదల కోసం కార్మికులు వ్యవసాయ కార్మికులు రైతులు కోసం వారి వారి సమస్యలు పరిష్కారం కోసం వర్గపోరాటాలు నిర్వహించారు అని ఘనంగా నివాళులు అర్పించారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళదాము అన్నారు . కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కొలికి పోగు శ్రీనివాసరావు. కొప్పుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం



అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐఎంఎస్) జిల్లా సహాయ కార్యదర్శి పుల్లన్న

గంగారం నవంబర్ 5 వుదయం :

అమరవీరుల స్మారక సభల లో భాగంగా గురువారం నాడు గంగారం మండలం పుట్టల భూపతి తండాలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ పుల్లన్న ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ సమాజంలో దోపిడీ పీడన అసమానతలు లేని నూతన సమాజం కోసం కొనసాగిన భారత విప్లవోద్యమంలో అనేకమంది అమరులు కావడం జరిగింది. వారి త్యాగాల ఫలితంగా నేడు ప్రజలు అనేక సమస్యలను పరిష్కరించుకొని పోడు భూములను సాధించుకున్నారు వారి ఆశయాలను ముందుకు తీసుకపోవడంలో భాగంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 7వ తేదీ న సాయంత్రం ఏడు గంటలకు కొత్తగూడలో జరుగు కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక బహిరంగ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, నిర్మల, లక్ష్మణ్, చందు, లక్ష్మి , వినోద, శ్రీను, వెంకన్న, సంజీవరావు, ప్రశాంత్, పాండు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల పురిటిగడ్డ నల్గొండలో జరిగే ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నల్గొండ మండలం నవంబర్ 05.



పోరాటాల పురిటిగడ్డ నల్గొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభ సందర్భంగా 15న లక్షమంది రైతుల తో యన్ జి కాలేజి గ్రౌండ్ లో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జాతీయ నాయకులు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వంతో అఖిల భారత కిసాన్ సభ ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతోందన్నారు. సామ్రాజ్యవాదం, భూస్వామ్యానికి వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, తెభాగా, వర్లీ ఆదివాసీ, పున్నప్ర–వయలార్, సుర్మా లోయ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో నయా ఉదార వాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మిస్తోందన్నారు. ఆ చారిత్రాత్మక పోరాటాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత కిసాన్ సభ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.దేశానికి అన్నం పెట్టే రైతాంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే శ్రమజీవులు నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా అమలవుతున్న ఆర్థిక విధానాలు అసమాన మార్కెట్ వ్యవస్థ, బలహీనమైన సామాజిక భద్రత, ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని వ్యవసాయ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమైందని పేర్కొన్నారు. పెట్టుబడి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు సమగ్ర విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు గిరిజనులు మహిళా రైతులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మతం కులం పేరుతో ప్రజలను విభజించే శక్తులకు బదులుగా జీవనోపాధి భూమి ఉపాధి ఆహార భద్రత వంటి మౌలిక సమస్యలపై ప్రజలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం గ్రామీణ పేదలకు ఉపాధి భూమిలేని నిరుపేదలకు భూమి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు.నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే 36వ అఖిల భారత జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుంచి 950 మందికి పైగా ప్రతినిధులు పరిశీలకులు నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. నవంబర్ 15న నల్గొండలో లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం ఎన్జీ కాలేజీ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ జరగనుందని పేర్కొన్నారు. నవంబర్ 14న నిర్వహించే రైతు ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన చారిత్రక పోరాటాలు రైతాంగ ఉద్యమాలు వ్యవసాయ పరిస్థితులను ప్రతిబింబించే అంశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.ఈ మహాసభలు రైతాంగ సమస్యలు వ్యవసాయ రంగ భవిష్యత్తు రైతుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై దేశవ్యాప్త చర్చకు కీలక వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కార్యదర్శి వీరపల్లి వెంకటేశ్వర్లు మహిళా కన్వీనర్ కందాల ప్రమీల వివిధ ప్రజాసంఘాల నాయకులు నారి ఐలయ్య డబ్బి కార్ మల్లేష్ సయ్యద్ హాశం పాలడుగు ప్రభావతి ఎండి సలీం దండెంపల్లి సత్తయ్య కంబాలపల్లి ఆనంద్ అవిశెట్టి శంకరయ్య బొజ్జ చిన్న వెంకులు చింతపల్లి బయన్న రాసకొండ వెంకట్ గౌడ్ కొండ అనురాధ రవి నాయక్ మల్లయ్య రెమిడాల పరుశరాములు ఉడుగుండ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

- ఎకరానికి రూ.25 వేల చొప్పన చెల్లించాలి
- రైతు సంఘం నాయకులు చందా చంద్రయ్య, దేశిరెడ్డి స్టాలిన్ రెడ్డి

మునగాల, నవంబర్ 5 (వుదయం):



మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన గాలివానలకు నేలవాలిన వరి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చందా చంద్రయ్య, దేశిరెడ్డి స్టాలిన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో మరో వారం రోజుల్లో కోతకు రావాల్సిన వరి పంటలు నేలవాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కంకులు పడిపోవడంతో ధాన్యం నాణ్యత దెబ్బతిని దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయాయని, మిగిలిన పంటలు కూడా గాలివానలకు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 33 శాతానికి పైగా ఎండిపోయిన పంటలతో పాటు నేలవాలిన వరి పొలాలను కూడా అధికారులు సర్వే చేసి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తుఫాను తో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 25000 నష్టపరిహారం చెల్లించాలి

మాజీ జడ్పిటిసి సున్నం నాగమణి

దమ్మపేట నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):



మురసు తుపాను నేపథ్యంలో పంటలు నష్ట పోయిన రైతులకు ఎకరా నికి ₹25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జడ్పీటీసి సున్నం నాగమణి డిమాండు చేశారు. మురసు తుపాను నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా వాగులు , రహదారూలు తెగిపోయి , చెరువులు గండ్లు పడి, చెరువులు పొంగి చేతికొచ్చిన పంటలు బారీగా నష్టం జరిగింది.తక్షణం రాష్ట్ర ప్రభుత్వం నష్ట పోయిన పంట పోలాలు పరిసిలించి ఎకరానికి ₹25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ఆమె తెలియజేశారు తక్షణమే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆమె తెలియజేశారు.

మురసు తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి నవంబర్ 5 (వుదయం ప్రతినిధి)

గొల్లగూడెం: మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, చేతికొచ్చిన వరి పంట నీటమునిగి అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలం గొల్లగూడెంలో స్థానిక నాయకులు, రైతులతో కలిసి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటమునిగిన పంటలను, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. ప్రారంభంలో క్వింటా ధాన్యం ధర రూ.4 వేల వరకు పలకగా, ప్రస్తుతం దళారులు తడిసిన ధాన్యం పేరుతో కేవలం రూ.3 వేలకే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో ఇప్పటికే నష్టపోయిన రైతులను దళారులు మరింత ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయించాలని, నష్టపోయిన రైతుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్షాలకు తడిసిపోయిన పత్తిని కొనుగోలు చేసేందుకు భారత పత్తి సంస్థ (CCI) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వరి, పత్తి పంటలు నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఎకరాకు తగిన నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో బొగ్గుల భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

మధిర, నవంబర్, 5, వుదయం, ప్రతినిధి:



మధిర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి భాస్కర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు ఆయన మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించి బొగ్గుల భాస్కర్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



అన్నదాతకు అండగా సండ్ర..

నీట మునిగిన పంట పొలాల పరిశీలన.. రైతులకు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్

కల్లూరు, నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):

మురుసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం కల్లూరు మండలంలో పరిశీలించారు. చంద్రుపట్ల తదితర గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరి, దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించడంతో పాటు బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోత దశకు చేరుకున్న వరి పంటలు నీట మునిగి, నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం కలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ అధికారులతో సమగ్ర పంట నష్టం సర్వే చేపట్టి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం అందించడంలో ఎలాంటి జాప్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జెడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, పెదకంటి రామకృష్ణ, పెద్దబోయిన మల్లేశ్వరరావు, కనపర్తి శ్యామల రాజ్ కుమార్, ఇంతియాజ్, దార్ల లక్ష్మీనరసింహారావు తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


మండల మహాసభలను జయప్రదం చేయండి



సత్తుపల్లి నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

స్థానిక వేంసూరు లో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వేంసూరు మండల శాఖ 13 వ మహాసభలను జయప్రదం చేయాలని మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు చంద్రశేఖర్, ఈశ్వరా చారి లు కోరారు. ఈ సభలో తాజా విద్యారంగ పరిణామాలు, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పై వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి చలంచర్ల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా బాధ్యులు పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శులు నిర్మలకుమారి, ఉమా మహేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సత్యవతి, దీన్ దయాల్, రాఘవులు,భాస్కర రావు,మారేశ్వర రావు,కిషోరి సత్యవాణి,రామశేషు,ప్రసన్న కుమార్,రాధాకృష్ణ, వీరాంజనేయ తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడెంలో ఉచిత వైద్య శిబిరం



మునగాల, నవంబర్ 5 (వుదయం):

మండలంలోని నారాయణగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం ఉచిత టీబీ, ఎక్స్‌రే పరీక్షలతో పాటు ఏసీఎఫ్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, క్షయ వ్యాధి లక్షణాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల లక్షణాలు, వాటి నివారణ చర్యలపై వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నరేష్, పంచాయతీ కార్యదర్శి రజిత, సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శి గోపాల్ రెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోటకొండూరు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ IPS గారు మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు మరియు పోలీస్ శాఖలోని వివిధ విభాగాల (Verticals) పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణకు సమర్థవంతంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ గారు సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీలో మోటకొండూర్ ఎస్‌హెచ్‌ఓ బి. కుమారస్వామి, ఏఎస్ఐ ప్రకాష్ ఇతర పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

వెంకటరమణ కాలనీ రహదారి సమస్యను పరిష్కరించాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ జిల్లా నవంబర్ 05 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీకి వెళ్లే రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేటర్లు, కాలనీ ముఖ్యులతో కలిసి జిల్లా ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీ వరకు సుమారు 100 మీటర్ల మేర రహదారి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు కంచర్ల తెలిపారు. అప్పటి ఎస్పీ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, కాలనీవాసులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా దారి కల్పించేందుకు అంగీకారం పొందిన తర్వాతే విద్యుత్ లైన్లను భూగర్భంలో ఏర్పాటు చేయడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు వివరించారు. అయితే ప్రస్తుతం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం పేరుతో రహదారికి స్థలం వదలకుండా ప్రహరీ నిర్మించడం సమంజసం కాదన్నారు. ఈ మార్గం కేవలం వెంకటరమణ కాలనీకే కాకుండా వసుంధర కాలనీ, పటేల్‌నగర్, సూర్యవంశం కాలనీ, చైతన్యపురి కాలనీలకు అనుసంధానంగా ఉంటుందని పేర్కొన్నారు. రహదారి లేకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వెళ్లేందుకు కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 100 మీటర్ల మేర రహదారి నిర్మాణం చేపడితే పలు కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారికి అవసరమైన స్థలం వదిలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రహరీ నిర్మించాలని ఎస్పీని కోరారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, దీప్లా నాయక్, గోపగోని స్వాతి రాజశేఖర్, నగర యూత్ వైస్ ప్రెసిడెంట్ వజ్జ శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు కన్నెబోయిన రమేష్, కునుకుంట్ల శంకర్, కందుల నరేందర్, నేర్లకంటి సుధాకర్, నీలకంఠం నాగార్జున, లింగస్వామి, ఓంకారచారి, కుమారచారి, రామలింగం, రాజు, మామిడాల సత్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు గ్లోబల్ స్కిల్స్ గిఫ్ట్!

- ఐటీడీఏ పీవో బి. రాహుల్ వినూత్న చొరవ
- 225 మంది గురుకుల డిగ్రీ విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీలో ఉచిత శిక్షణ

భద్రాచలం 05 నవంబర్ 26 వుదయం ప్రతినిధి

గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, వారిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో భద్రాచలం ఐటీడీఏ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గిరిజన విద్యార్థులు కేవలం డిగ్రీ పట్టాలు పొందడానికే పరిమితం కాకుండా, ప్రస్తుత ప్రపంచంలో పెరుగుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలనే గొప్ప సంకల్పంతో ఐటీడీఏ పీవో బి. రాహుల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన 225 మంది గిరిజన విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆధునిక కోర్సుల్లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించడం విశేషంగా నిలిచింది. నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, సైబర్ భద్రత వంటి అంశాలు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా యువతకు సాంకేతిక నైపుణ్యాలు ఉంటేనే భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందడంతో పాటు స్వయం ఉపాధి రంగంలో కూడా రాణించే అవకాశం ఉంటుంది. ఈ వాస్తవాన్ని గుర్తించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్ గిరిజన విద్యార్థులకు డిగ్రీ విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే అదనపు నైపుణ్యాలను అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ శిక్షణలో భాగంగా డిజిటల్ మార్కెటింగ్ ద్వారా వ్యాపార ఉత్పత్తులను ప్రజలకు ఎలా చేరువ చేయాలి? సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకుని వ్యాపారాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి? ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో అనుసరించాల్సిన విధానాలు ఏమిటి? సొంత బ్రాండ్‌ను ఎలా రూపొందించుకోవాలి? డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను ఎలా సృష్టించుకోవాలి? వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. అదే విధంగా సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాల్లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, పాస్‌వర్డ్‌లు, డిజిటల్ పత్రాలను సైబర్ నేరగాళ్ల నుంచి ఎలా రక్షించుకోవాలి? ఆన్‌లైన్ మోసాలను ఎలా గుర్తించాలి? అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత సందేశాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే విషయాలను నిపుణుల ద్వారా వివరించారు. తద్వారా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం, దమ్మపేట, కొత్తగూడెం, మణుగూరు గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులను వారి ఆసక్తి, మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేశారు.

మొత్తం 225 మంది విద్యార్థులకు ఆగస్టు 28వ తేదీ నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు 40 రోజులపాటు మొత్తం 100 గంటల పాటు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ అందించారు. డాటా ప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు నిపుణుల ద్వారా వివిధ అంశాలపై బోధన అందించడంతో పాటు, వారు నేర్చుకున్న విషయాలను అంచనా వేయడానికి ప్రత్యేక పరీక్షలు కూడా నిర్వహించారు. శిక్షణకు అవసరమైన అధ్యయన సామగ్రిని అందించి, విద్యార్థులు ప్రతి అంశాన్ని సులభంగా అర్థం చేసుకునేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతున్న సమయంలో ఐటీడీఏ పీవో బి. రాహుల్ స్వయంగా కార్యక్రమాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణలో వారు చూపిస్తున్న ఆసక్తి, నేర్చుకుంటున్న నైపుణ్యాల గురించి తెలుసుకుని వారిని మరింత ప్రోత్సహించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం విద్యార్హతలపైనే ఆధారపడకుండా, అదనపు సాంకేతిక నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నేర్చుకున్న విషయాలను భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల సాధనకు, స్వయం ఉపాధి అభివృద్ధికి ఉపయోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే వారు కూడా ఉన్నత స్థాయికి ఎదగగలరనే నమ్మకంతో ఐటీడీఏ ఇటువంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోంది. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్న 225 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ప్రైవేటు సంస్థల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి నేర్చుకోవాల్సిన ఆధునిక సాంకేతిక కోర్సులను ఐటీడీఏ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా నేర్చుకునే అవకాశం లభించడం పట్ల విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సాధారణంగా ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇలాంటి ఖరీదైన కోర్సులను అభ్యసించలేని గిరిజన విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. తమ విద్యాభ్యాసానికి అదనంగా భవిష్యత్తులో ఉద్యోగాలు పొందేందుకు దోహదపడే విలువైన నైపుణ్యాలను అందించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్‌కు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంపై ఖమ్మం గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రజనీ, దమ్మపేట గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్పందన, కొత్తగూడెం గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, మణుగూరు గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంతో ఖరీదైన, ఉద్యోగ అవకాశాలకు దోహదపడే ఆధునిక కోర్సులను ఉచితంగా అందించడం ఐటీడీఏ పీవో బి. రాహుల్ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. డిగ్రీ విద్యతో పాటు డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లో శిక్షణ పొందిన ఈ విద్యార్థులు భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు స్వయం ఉపాధి దిశగా కూడా అడుగులు వేసే అవకాశం ఉంది. గిరిజన యువతకు నైపుణ్యమే బలంగా, విద్యే ఆయుధంగా, ఆత్మవిశ్వాసమే విజయానికి మార్గంగా నిలవాలనే లక్ష్యంతో ఐటీడీఏ పీవో బి. రాహుల్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమంపై విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించి, గిరిజన విద్యార్థులకు మరిన్ని ఆధునిక కోర్సులు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.



జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమం

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అల్పాహార పంపిణీ
- సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్

నల్గొండ జిల్లా నవంబర్ 05 వుదయం ప్రతినిధి



సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ వీల్స్ అండ్ మీల్స్ సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, ప్రజా చైతన్యమే లక్ష్యంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి అల్పాహారం పంపిణీ చేశారు. అంతకుముందు పానగల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మదన్మోహన్ రేపల, వైస్ గవర్నర్ సతీష్ కోడె, లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిస్ మాజీ అధ్యక్షురాలు సరిత కోట, మాజీ జోనల్ చైర్మన్ ఝాన్సీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్, జ్యోతి రెడ్డి, న్యాయవాదులు అక్కెనపల్లి మురళీధర్ రావు, కీసర శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ సభ్యులు మారం వెంకటరమణ రెడ్డి, మాధవి, నిర్మల, సమితి సభ్యులు వాడపల్లి సాయిబాబా, మాదగోని బిక్షపతి గౌడ్, తాళ్ల నిరంజన్, కర్నాటి యాదగిరి, బోనగిరి సందీప్, సంతోష్, మేడి యాదయ్య, శ్రీ వాస్తవ్, స్నిగ్ధ, రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్

చండూరు,నవంబర్ 5 (వుదయం):



ప్రతి పట్టభద్రుడి ఓటు ప్రజాస్వామ్య బలోపేతానికి బలమైన పునాది అని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం చండూరు తహసీల్దార్ మణికాంత్ శర్మకు తన దరఖాస్తును అందజేశారు.ఈ సందర్భంగా పల్లె రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నవంబర్ 6వ తేదీలోగా ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు పూర్తి చేసుకోవాలని, తమతో పాటు మిగిలిన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించి నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చండూరు మాజీ ఎంపీపీ పల్లె కళ్యాణి రవికుమార్ గౌడ్, బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు మహ్మద్ యూసుఫ్, డిప్యూటీ తహసీల్దార్ సరిత, యువజన నాయకులు మాధగోని అరుణ్ కుమార్, యనమల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

- నల్లగొండ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు
- నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బైరెడ్డి హేమలత వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీరాములు గౌడ్



నల్గొండ జిల్లా నవంబర్ 05 వుదయం ప్రతినిధి

నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బైరెడ్డి హేమలత వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీరాములు గౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను మంత్రి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా నూతన పాలకవర్గం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని నూతన పాలకవర్గానికి పిలుపునిచ్చారు.

వర్షాకాల వ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరం



మధిర,నవంబర్ 5, వుదయం , ప్రతినిధి:

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మధిర పట్టణంలోని లడక్ బజార్‌లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పల్లె దవాఖాన వైద్యురాలు వి. హేమలత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరించారు. అదేవిధంగా పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని,వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో ఏఎన్ఎం లు వై. లక్ష్మి, జి. సావిత్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా ఇల్లూరు ఎంపిక

సర్పంచ్ చేకూరి ఆదిలక్షి హర్షం

మధిర, నవంబర్,5, వుదయం, ప్రతినిధి:



కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి,పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని అమలు చేస్తున్న పీఎం ఏజేఏవై ఆదర్శ గ్రామపంచాయతీ కార్యక్రమంలో భాగంగా మధిర మండలంలోని ఇల్లూరు గ్రామం ఆదర్శ గ్రామపంచాయతీగా ఎంపికైంది. మధిర మండలంలో నంబర్ వన్ గ్రామంగా ఇల్లూరు ఎంపిక కావడం పట్ల గ్రామ సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కులమత రాజకీయాలకు అతీతంగా గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని,భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలు, అధికారుల సహకారంతో మరింత అభివృద్ధి సాధించి ఆదర్శ గ్రామంగా ముందుకు సాగుతామని తెలిపారు.ఇల్లూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడంలో కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన జిల్లా, మండల అధికారులకు సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడే డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రాక

జిల్లా ఈసీ మెంబర్ కందుకూరి ఉపేందర్

చిలుకూరు నవంబర్ 05:(వుదయం)

మండల కేంద్రంలోని జగ్జీవన్ రామ్ నగర్ కాలనీలో స్వేరోస్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో, అనారోగ్యం కారణంగా మరణించిన కందుకూరి గురవయ్య కుటుంబాని కి భీమ్ హోం నిర్మించనున్నట్లు జిల్లా ఈసీ మెంబర్ కందుకూరి ఉపేందర్,తెలిపారు. ఈ భీమ్ హోం భూమి పూజ కార్యక్రమానికి సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విచ్చేస్తున్నారని అన్నారు. స్వేరో ఎప్పుడూ ఒంటరి కాదని మరణించిన స్వేరో కుటుంబానికి అండగా ఉంటుందని చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు.

స్వేరో నెట్ వర్క్ రాష్ట్ర, జిల్లా కమిటీతో పాటు స్థానిక స్వేరో నెట్ వర్క్ గ్రామ, మండల కమిటీ, గ్రామ పెద్దలు సహకారంతో ఈ కార్యక్రమానికి, సంబంధించిన అన్ని ఏర్పాట్లు జిల్లా అధ్యక్షుడు పిడమర్తి దశరథ,స్వేరో పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు. కావున ఈ మహత్తర కార్యక్రమంలో స్వేరోలు,అంబేద్కర్ అభిమానులు, ప్రజాస్వామ్య వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రైస్తవ మహిళలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- క్రైస్తవులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి
- యూడీసీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు వంగూరి జయమ్మ (దెబోరా)

నల్గొండ, జిల్లా నవంబర్ 05 వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో క్రైస్తవ మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని యూడీసీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాస్టరమ్మ వంగూరి జయమ్మ (దెబోరా) డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో మత ప్రచారం చేస్తున్నారనే నెపంతో ఇద్దరు క్రైస్తవ మహిళలను దారుణంగా కొట్టి హింసించడం అమానవీయమని,

ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం నల్గొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో ఉన్న బాప్టిస్ట్ చర్చిలో యూడీసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఐ. శాంసన్, ప్రధాన కార్యదర్శి పెదమామిడి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో జిల్లా మహిళా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వంగూరి జయమ్మ (దెబోరా)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా శృతి, శైలజ, రుతమ్మ, వెంకటమ్మ, రాజకుమారి, వరలక్ష్మి, నాగేంద్ర, నాగమణి, విజయరాణి, నాగమణి, లిడియాలను ప్రకటించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జయమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతానికి, క్రైస్తవ సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. మత ప్రచారం చేస్తున్నారనే కారణంతో మహిళలపై దాడి చేయడం, దుర్భాషలాడటం హేయమైన చర్య అని అన్నారు. మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే చర్యలను సహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు అజార్య నాయక్, ఏపీ ప్రభాకర్, చంద్రపాల్, లింగారెడ్డి, లాజర్, యోహాను, లూకాస్, యాకీన్ తదితరులు పాల్గొన్నారు.



లింగయ్య చిత్రపటానికి కాంగ్రెస్ నేతల ఘన నివాళులు

మునగాల, నవంబర్ 5 (వుదయం):

మునగాల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ భీమనబోయిన లింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటయ్య, మండల సీనియర్ నాయకులు పోటు అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



శ్రీకృష్ణ ప్రసాద్‌ను పరామర్శించిన మంత్రి తుమ్మల

మధిర, నవంబర్, 5, వుదయం, ప్రతినిధి:

జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వారి స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ప్రసాద్‌తో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంట పలువురు సహచరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు బియ్యం, కూరగాయల పంపిణీ

అశ్వారావుపేట, నవంబర్ 5, (వుదయం ప్రతినిధి)

అశ్వారావుపేట మండలంలోని కేసప్పగూడెం గ్రామం కే.సీ.ఆర్ కాలనీలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇళ్లన్నీ నీటమునిగాయి. ఇళ్లలోని నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు నీట మునగడంతో సుమారు 25 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం వరద ప్రభావిత కే.సీ.ఆర్ కాలనీలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా కాసాని చంద్రమోహన్–పద్మ, డా. భూక్యా ప్రసాద్–డా. ఉదయ జ్యోతి ఆధ్వర్యంలో 25 కుటుంబాలకు బియ్యం, కూరగాయలను పంపిణీ చేసి తమ వంతు సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో కేసప్పగూడెం సర్పంచ్ సోడెం భారతి, వార్డు సభ్యులు కొవ్వసి భారతి, సోయం వెంకటమ్మ, సున్నం పార్వతి, వేదాంతపురం సర్పంచ్ సోడెం ముత్యాలరావు , పిల్లెం బొత్తయ్య , సొందెం ముత్యాలరావు , సొందెం కృష్ణ ,వేదాంతపురం మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్, అశ్వారావుపేట టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, గూడవర్తి వెంకటేశ్వరరావు, జజ్జురపు శ్రీరామమూర్తి, తగరం జగన్నాథం, శెట్టిపల్లి రఘురామ్, జక్కం బలరామకృష్ణ, రాజనాల గంగాధర్, మోటూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల పురిటిగడ్డ నల్గొండలో ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

- 15న లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన.. ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ
- మహాసభలను జయప్రదం చేయండి సంఘం అధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 05 వుదయం ప్రతినిధి



నల్గొండ జిల్లా కేంద్రంలో పోరాటాల పురిటి గడ్డ నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, రైతు సంఘం జాతీయ నాయకుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మహాసభల ప్రారంభం సందర్భంగా నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం నల్గొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో నిర్వహించిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వంతో అఖిల భారత కిసాన్ సభ ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతోందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, తెభాగా, వర్లీ ఆదివాసీ, పున్నప్ర–వయలార్, సుర్మా లోయ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు.

వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో..

దేశానికి అన్నం పెట్టే రైతాంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే వ్యవసాయ కార్మికులు నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన ఆర్థిక విధానాలు, అసమాన మార్కెట్ వ్యవస్థ, ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టుతున్నాయని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, మహిళా రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మతం, కులం పేరుతో ప్రజలను విభజించే శక్తులకు వ్యతిరేకంగా జీవనోపాధి, భూమి, ఉపాధి, ఆహార భద్రత వంటి మౌలిక సమస్యలపై ప్రజలు సంఘటితం కావాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం, గ్రామీణ పేదలకు ఉపాధి, భూమిలేని నిరుపేదలకు భూమి, సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు.

15న లక్ష మంది రైతులతో ప్రదర్శన

నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే జాతీయ మహాసభలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 950 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన, అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వివరించారు. నవంబర్ 14న రైతు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వ్యవసాయ రంగ చరిత్ర, రైతాంగ పోరాటాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను ప్రతిబింబించే అంశాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. రైతాంగ సమస్యలు, వ్యవసాయ రంగ భవిష్యత్తు, రైతుల హక్కుల పరిరక్షణపై దేశవ్యాప్త చర్చకు ఈ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పలువురు నాయకుల హాజరు

ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి వీరపల్లి వెంకటేశ్వర్లు, మహిళా కన్వీనర్ కందాల ప్రమీల, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, కంబాలపల్లి ఆనంద్, అవిశెట్టి శంకరయ్య, బొజ్జ చిన్న వెంకులు, చింతపల్లి బయన్న, రాసకొండ వెంకట్‌గౌడ్, కొండ అనురాధ, రవి నాయక్, మల్లయ్య, రెమిడాల పరశురాములు, ఉడుగుండ్ల రాములు పాల్గొన్నారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో 'శతరాగ దాశరథి' గ్రంథం ఆవిష్కరణ



భద్రాచలం 5/11/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈరోజు సాహితీ, సంగీత రంగాలకు విశేష ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం జరిగింది. ప్రముఖ గాయని శ్రీమతి జి. శ్రీ రామ రత్న గారు రూపొందించిన 'శతరాగ దాశరథి' అనే విశిష్ట గ్రంథాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ కె. దామోదర్ రావు గారు ఆలయంలో ఘనంగా ఆవిష్కరించారు. భక్త రామదాసు గారు రచించిన అపురూపమైన దాశరథీ శతకంలోని 103 పద్యాలను ఎంపిక చేసుకుని, ప్రతి పద్యాన్ని 103 విభిన్న రాగాలలో స్వరపరచడం ఈ గ్రంథం ప్రత్యేకత. కేవలం పద్యాలను స్వరపరచడమే కాకుండా, వాటికి సంబంధించిన స్వర వివరాలు, పద్యాల భావం, తాత్పర్యాలను కూడా పొందుపరుస్తూ శ్రీమతి జి. శ్రీ రామ రత్న గారు ఈ గ్రంథాన్ని ఎంతో శ్రద్ధతో, భక్తిభావంతో రూపకల్పన చేశారు. భక్త రామదాసు గారి అపారమైన శ్రీరామ భక్తిని, ఆయన సాహిత్య ప్రతిభను, దాశరథీ శతకంలోని ఆధ్యాత్మిక సందేశాన్ని సంగీత రూపంలో మరింతమందికి చేరువ చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ ప్రయత్నం చేశారు. ఒకవైపు సాహిత్య మాధుర్యం, మరోవైపు సంగీత స్వర సౌందర్యం కలగలిపి రూపొందించిన ఈ గ్రంథం సంగీత ప్రియులకు, సాహితీ అభిమానులకు, శ్రీరామ భక్తులకు ఎంతో ఉపయోగకరంగా నిలవనుంది. దాశరథీ శతకం తెలుగు భక్తి సాహిత్యంలో విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది. భక్త రామదాసు గారి పద్యాలలోని భక్తిభావం, శ్రీరామునిపై ఉన్న అచంచలమైన విశ్వాసం, ఆధ్యాత్మిక తత్వం ప్రతి పద్యంలోనూ ప్రతిబింబిస్తాయి. అలాంటి మహోన్నతమైన పద్యాలను విభిన్న రాగాలలో స్వరపరచి, వాటి తాత్పర్యాలతో సహా ఒకే గ్రంథంగా అందించడం అభినందనీయమైన కృషిగా చెప్పవచ్చు. ముఖ్యంగా 103 పద్యాలకు 103 రాగాలను అనుసంధానం చేయడం ద్వారా సంగీతం, సాహిత్యం, భక్తి అనే మూడు అంశాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన అరుదైన ప్రయత్నంగా 'శతరాగ దాశరథి' గ్రంథం నిలుస్తుంది. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ కె. దామోదర్ రావు గారు గ్రంథాన్ని ఆవిష్కరించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీ లింగాల సాయి బాబా గారు, దేవస్థానం రామాయణ పారాయణదారు శ్రీ ఎస్.టి.జి. అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నవజాత శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్‌కు తగ్గించడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- 'సంకల్ప్' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి



యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లాలో నవజాత శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించి, సింగిల్ డిజిట్‌కు తీసుకురావడమే లక్ష్యంగా 'సంకల్ప్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 'సంకల్ప్' కార్యక్రమం అమలుపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ పాల్గొని, సంబంధిత వైద్యాధికారులతో చర్చించారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ తణిగైనాథన్ ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేసిన 'సంకల్ప్' కార్యక్రమం అనుభవాలను యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్ సహకారంతో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ తణిగైనాథన్ ప్రత్యేక సెషన్ నిర్వహించి, ఆదిలాబాద్ జిల్లాలో కార్యక్రమం అమలు చేసిన విధానం, సాధించిన ఫలితాలు, నవజాత శిశు మరణాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులు, జిల్లాలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై వివరించారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు, సురక్షిత ప్రసవాలు, ప్రసవానంతర సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా చర్చించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం, పుట్టిన వెంటనే శిశువులకు అవసరమైన వైద్య సంరక్షణ కల్పించడం, వైద్య సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో పాటు అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయడం ద్వారా శిశు మరణాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు.

నవజాత శిశుసంరక్షణ,అంచనా చెకప్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూర్యశ్రీ రావు, ఏహెచ్ రామన్నపేట మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీహెచ్‌సీ ఆలేరు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె. స్వప్న రాథోడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి యాదాద్రి పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

- నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్

నల్గొండ, జిల్లా నవంబర్ 05 వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అందిన ఫారం–18 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిని వివరించారు. ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో 6,09,357 ఫారం–18 దరఖాస్తులు అందాయని, గత ఎన్నికల సమయంలో 5.60 లక్షల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలిపారు. అందిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 2,26,380 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు.గత 24 గంటల్లోనే నియోజకవర్గ పరిధిలో 61,850 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. డేటా కరెక్షన్, డూప్లికేట్ దరఖాస్తుల గుర్తింపు వంటి అంశాలను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫారం–18 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తులకు స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని, పెద్ద మొత్తంలో ఒకేసారి సమర్పించే దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఎలాంటి డూప్లికేట్ నమోదు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నవంబర్ 25న నిర్ణీత గడువులోగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఇతర నిర్దేశిత కార్యాలయాల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. డేటా సవరణలు, డీఎస్ఈ కరెక్షన్లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్యంలో ఓటు విలువపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో 560 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంత్రుల చేతుల మీదుగా పంపిణీ

మిర్యాలగూడ టౌన్ నవంబర్ 5 (వుదయం ప్రతినిధి)



మిర్యాలగూడ మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను రేపు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో, కార్యక్రమ ఏర్పాట్లపై మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి –BLR గారు తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు… ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, వెంకటాద్రిపాలెం సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీకి "ఇందిరమ్మ ఇళ్లు – మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీ" గా నామకరణం చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం రేపు జరగనున్న 560 ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు, ముఖ్యంగా ఇళ్లను పొందనున్న లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సదుపాయాలను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, ఇన్‌చార్జి డీఎస్పీ రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి బంగారం, వెండి చోరీ

1.5 తులాల బంగారు గొలుసు, ఏడు వెండి మొలతాళ్ల అపహరణ

వేములవాడ రూరల్ నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :



ఇంటికి తాళం వేసి వెళ్లిన మహిళకు దొంగలు షాక్ ఇచ్చారు. ఇంటి తాళంతో పాటు బీరువా తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఈ ఘటన వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన పాటి కళ్యాణి నవంబర్ 4న మధ్యాహ్నం 3 గంటలకు తన అమ్మగారి ఊరైన కొనాయిపల్లికి ఇంటికి తాళం వేసి వెళ్లింది. అదే రోజు అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆమె అత్త రమ ఫోన్ చేసి ఇంటి తాళం పగలగొట్టి ఉన్నట్లు సమాచారం ఇచ్చింది. వెంటనే ఇంటికి చేరుకున్న కళ్యాణి పరిశీలించగా ఇంటి తాళంతో పాటు బీరువా తాళం కూడా పగలగొట్టి కనిపించింది. బీరువాలో భద్రపరిచిన సుమారు 1.5 తులాల బంగారు గొలుసు, ఏడు వెండి మొలతాళ్లు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గుర్తుతెలియని దొంగల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

యువతలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా వ్యాసరచన, క్విజ్ పోటీలు
- నవంబర్ 2 నుంచి 18 వరకు మూడు స్థాయిల్లో నిర్వహణ

సూర్యాపేట, నవంబర్ 05: వుదయం ప్రతినిధి

భారత ఎన్నికల సంఘం యువతలో ఎన్నికల అవగాహనను పెంపొందించేందుకు చేపట్టిన కొత్త కార్యక్రమాల్లో భాగంగా, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అన్ని జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... యువతలో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల (ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌లు) ద్వారా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పోటీలను మూడు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో నవంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. అనంతరం నవంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

విద్యార్థులు వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. యువతలో ఎన్నికల అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని, ఎన్నికల ప్రక్రియలో చైతన్యవంతమైన యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో



ప్రేమ్ రాజు, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు వేణుమాధవ్ రావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ నిధులు ఉన్నా మరమ్మతులకు నోచుకోని ఇందిరమ్మ కాలనీ రోడ్డు

అనంతగిరి, నవంబర్ 5 వుదయం



మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారి దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది.రహదారి ఉందా? గుంతలే ఉన్నాయా? అన్నట్లు రోడ్డంతా గుంతలమయమై, వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువును తలపిస్తోంది.నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు.

ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలా?

రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడకుండా తప్పించుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది.వృద్ధులు, మహిళలు చిన్నారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రజలకు కనీస రహదారి సౌకర్యం కల్పించలేని పరిస్థితిలో గ్రామ పాలన సాగుతోందా? అంటూ కాలనీవాసులు నిలదీస్తున్నారు...

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం!

ఈ రహదారి దుస్థితిపై పలుమార్లు సంబంధిత గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామపంచాయతీలో కొంత బడ్జెట్ అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు అత్యవసరమైన ప్రధాన రహదారిని మరమ్మతు చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు కనిపించని గుంతలు.. వినిపించని ప్రజల గోడు!

ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా అధికారుల్లో కనీస చలనం లేకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు మౌనం వహిస్తే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రమత్తు వీడి రహదారిని స్వయంగా పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందిస్తారా? లేక ముందే మేల్కొని రహదారిని బాగుచేస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

24వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం సమస్యల పరిష్కారానికి సానుకూల హామీ

నల్గొండ జిల్లా
నవంబర్ 05 వుదయం ప్రతినిధి



నల్లగొండ జిల్లా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 24వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రతినిధి బృందం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యలు, ఉద్యోగ భద్రత, ఇతర న్యాయమైన డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమ్మె కారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఉద్యోగుల వినతిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగులు తెలిపారు. తమ సమస్యలను రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ఉద్యోగుల్లో సమస్యల పరిష్కారంపై ఆశలు చిగురించాయి. 24 రోజులుగా ఎండనక, వాననక తమ హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, ప్రభుత్వం తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సేవలను గుర్తించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దయానంద్, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, ప్రతిభ, డాక్టర్ వెంకటేశం, డెంటల్ టెక్నీషియన్ శ్రీనివాస్, డాక్టర్ గణేష్, ఎండీ ఖలీమ్, డాక్టర్ టి.రవి, పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు

ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి. సూర్య ప్రకాష్

దామరచర్ల మండలం, వుదయం ప్రతినిధి



ఏపీలో అర్నబ్ తుఫాన్ ధాటికి పలు డివిజన్లలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా నర్సాపూర్ డివిజన్, మొగల్తూరు సెక్షన్ లో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఎన్నో రోజుల నుండి గ్రామాలలో, పట్టణాలలో కరెంటు లేక ప్రజలు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ మేనేజ్మెంట్ తక్షణ సహాయాన్ని అందించింది. అన్ని సర్కిల్స్ నుండి తెలంగాణ విద్యుత్ శాఖ సిబ్బంది ఏపీ రాష్ట్రానికి చేరుకున్నారు. నర్సాపూర్ డివిజన్, మొగల్తూరు సెక్షన్ స్థానిక ఏడీఈ రాజీవ్, లైన్ మెన్ సుధీర్ తో కలిసి కరెంటు పునరుద్ధరణ పనుల్లో భాగంగా గ్రామాలు, పట్టణాలను పరిశీలించడానికి ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి. సూర్య ప్రకాష్, సీజీఎం, జీఎం వెళ్లారు. పడిపోయిన స్తంభాలను, లైన్లను, జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ డివిజన్ లో 33 కేవీ, 11 కేవీ, ఎల్.టి. లైన్లకు చెందిన దాదాపు 1000 స్తంభాలు తుఫానుకు విరిగి పడిపోయాయి. వాటిని నూతనంగా ఏర్పాటు చేసి, పునరుద్ధరణ పనులు చేసి అదే రోజు గ్రామాలలో, పట్టణాలలో కరెంటు ఇవ్వడం జరుగుతున్నందున అధికారులు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ నల్గొండ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అమరారావు శ్రీనివాస్, మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ చారి, ఏఈలు వినోద్ కుమార్, రవీందర్ రెడ్డి, వీరభద్రం, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మారం శ్రీనివాస్ లతో పాటు కార్మికులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు ఎల్లయ్యచారి, బిక్షమయ్య, జలంధర్, సతీష్, వెంకటరత్నం, సిబ్బంది వెంకన్న, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే కేసులు తప్పవు!

వాహనదారుల ప్రాణాలతో చెలగాట మాడితే కఠిన చర్యలు

ముత్తారం
నవంబర్ 05(వుదయం ప్రతినిధి):

రహదారులపై ధాన్యం ఆరబోసి వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం ముత్తారం ఎస్సై ఎన్. రవికుమార్ హెచ్చరించారు.రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా కల్లాలు,సొంత స్థలాలను వినియోగించుకోవాలని సూచించారు.రోడ్లపై ధాన్యం వల్ల వాహనాలు జారిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని,ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రాణాపాయం పొంచి ఉందని తెలిపారు.రోడ్లపై ధాన్యం పోయవద్దని,వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించవద్దని,ప్రమాదాలకు కారణమయ్యే నిర్లక్ష్యానికి దూరంగా ఉండాలని రైతులకు సూచించారు.ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలను సహించబోమని,నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై స్పష్టం చేశారు.రోడ్డు భద్రతకు రైతులు సహకరించాలని కోరారు.



గట్టుప్పల్‌లో అక్రమ బెల్ట్‌షాపులపై పోలీసుల ఉక్కుపాదం

- 10 మందికి రూ. 2 లక్షల చొప్పున బైండోవర్
- కఠిన చర్యలు తప్పవని ఎస్సై సంపత్ హెచ్చరిక

గట్టుప్పల్, నవంబర్ 5(వుదయం):

గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపులు నడుపుతున్న 10 మందిని శనివారం పోలీసులు గుర్తించి, వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఎస్సై సంపత్ నేతృత్వంలో నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. భవిష్యత్తులో అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడబోమని హామీ ఇస్తూ ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షల చొప్పున పూచీకత్తు తీసుకొని బైండోవర్ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై సంపత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల జోరుకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ అక్రమ వ్యాపారాలు చేస్తే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



నూతన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు త్వరలో ప్రారంభం

- జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్
- క్రీడాకారులకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించేందుకు ఇండోర్ కోర్టు ఏర్పాటు
- బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ

పెద్దపల్లి,
నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో ఈ కోర్టును ఏర్పాటు చేసినట్లు ,ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును వినియోగించుకునే క్రీడాకారులు తప్పనిసరిగా రూ.1,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి నెల రూ.1,000 రుసుము చెల్లించవలసి ఉంటుందని పేర్కొన్నారు. కోచ్ ద్వారా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో ప్రత్యేక శిక్షణ పొందే బాలబాలికలకు నెలకు రూ.800 శిక్షణ రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. గంట బ్యాడ్మింటన్ ఆడేందుకు రూ.300 చెల్లించవలసి ఉంటుందని వెల్లడించారు. ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు పనివేళలు ఉదయం 5:30 గంటల నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 5:00 గంటల నుంచి 9:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులో ఆడే క్రీడాకారులు తప్పనిసరిగా బ్యాడ్మింటన్ షూస్ మాత్రమే ధరించాలని సూచించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్వయంగా, ఫోన్ ద్వారా జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయం, మొదటి అంతస్తు, గది నంబర్ 232లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మరిన్ని వివరాలకు 99639 60063 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఎంపీ వంశీకృష్ణపై కుట్రపూరిత విమర్శలు




నేతకాని మహర్ సంఘం, సమతా సైనిక్ దళ్ నాయకులు

పెద్దపల్లి,నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం వంశీకృష్ణపై రాజకీయ దురుద్దేశంతో కొందరు వ్యక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలను, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నేతకాని మహర్ సేవా సంఘం,సమతా సైనిక్ దళ్ నాయకులు స్పష్టం చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి నేతకాని,వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి కుమార్,సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం నగేష్,భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూఎంపీగా గెలిచిన నాటి నుంచి వంశీకృష్ణ నియోజకవర్గ ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు.మంచిర్యాలలో నేతకాని భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి కోటి రూపాయల నిధులు కేటాయించారని గుర్తుచేశారు.గెజిట్‌లో నేతాని అని తప్పుగా ఉన్న పదాన్ని నేతకాని గా సవరించేందుకు రాష్ట్ర,కేంద్ర గెజిట్లలో ఆయన తీవ్ర కృషి చేస్తున్నారని వివరించారు.వారి తండ్రి రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సైతం నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో పోరాడుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బసంత్ నగర్ విమానాశ్రయం,రామగిరి ఖిల్లా అభివృద్ధి,ఆర్ఎఫ్‌సీఎల్ వంటి కీలక అంశాలపై ఎంపీ వంశీకృష్ణ కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని కొనియాడారు.బాబాసాహెబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాల్సిన కొందరు దళితులు,అగ్రకుల శక్తుల అడుగులకు మడుగులొత్తుతూ ఎంపీ వంశీకృష్ణపై సేగ్గం రాజేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు ఇలాంటి చౌకబారు వ్యక్తులతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇకనైనా కుట్రపూరిత విమర్శలు,సంస్కారహీనమైన భాషను మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సోదరి తిరుపతి, ఉపాధ్యక్షులు కొత్తపల్లి గంగేష్,జాడి రాజేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గోమస శ్రీకాంత్,కోశాధికారి దుర్గం చరణ్ దాస్, సీనియర్ నాయకులు సల్లూరి కిష్టయ్య, నాయకురాళ్లు జాడి కల,సేగ్గం చంద్రమ్మ, గవ్వల అనితలతో పాటు పలు దళిత సంఘాల నాయకులు,మహిళలు పాల్గొన్నారు.


ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాల పంపిణీ

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)



జిల్లా కలెక్టర్, పెద్దపల్లి వారి ఆదేశాల మేరకు, రానున్న యాసంగి 2026–27 సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ అవసరాలకు నీటి సరఫరా ఉండకపోవచ్చని, కేవలం తాగునీటి అవసరాలకే నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందని తెలిపారు.ఈ పరిస్థితుల్లో రైతులు భూములను బీడుగా ఉంచడం లేదా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను, ముఖ్యంగా తక్కువ నీటి అవసరం కలిగిన కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేసుకోవాలని సూచించారు. రైతులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ (NSC) ద్వారా ఉచితంగా కూరగాయల విత్తన కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో కిట్‌లో ఏడు రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయని, ఈ విత్తనాలు 10 గుంటల విస్తీర్ణంలో సాగు చేసుకోవడానికి సరిపోతాయని, ఒక్కో కిట్ విలువ సుమారు రూ.1,000 ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను సంబంధిత మండల ఉద్యానవన అధికారులు లేదా ఉద్యానవన విస్తరణ అధికారులకు అందజేయాలని జిల్లా ఉద్యానవన అధికారి కోరారు.

టిఆర్ఎస్ నాయకుల్లారా అనుచిత వ్యాఖ్యలు తగవు



జువ్వాడి కృష్ణారావు పై అనుచిత వాక్యాలు చేసిన బిఆర్ఎస్ నేతులపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

కోరుట్ల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు దువ్వాడ కృష్ణారావు పై ఇటీవల టిఆర్ఎస్ నాయకులు చేసిన వాక్యలను తీవ్రంగా ఖండిస్తూ కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావుకు ఎటువంటి పదవి లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనలోని అభివృద్ధి సంక్షేమ ఫలాలను ఇంటింటికి అందిస్తున్న నిస్వార్థపరుడైన నాయకులు కృష్ణారావు అని అలాంటి నాయకుని పై టిఆర్ఎస్ నాయకులు మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించిన మండల కాంగ్రెస్ పార్టీ నేతలు జువ్వాడి కృష్ణారావు అంటే అసలు ఎవరో తెలియదన్నట్లు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ నేతలు తెలిపారు జువ్వాడి కృష్ణారావు అంటే ఏమిటో వారి నిస్వార్థమైన రాజకీయ సేవలను గురించి కోరుట్ల నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు జువ్వాడ కృష్ణారావుకు కోరుట్ల నియోజకవర్గంలో పోటు హక్కు ఉన్న విషయాన్ని ఈ బిఆర్ఎస నేతలకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు కోరుట్ల నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలో జువ్వాడి కృష్ణారావుకు సొంత ఇంటి నిర్మాణం చేసుకున్నారని అభివృద్ధి సంక్షేమ ఫలాలను కోరుట్ల నియోజకవర్గానికి ఇంటింటికి తీసుకుపోతున్నారని కొనియాడారు కృష్ణారావు పై అనుచిత వాక్యాలు చేసిన టిఆర్ఎస్ నాయకులు కళ్ళు ఉన్న కబోదులను ఆనాడు కాంగ్రెస్ పాలనలో ఇవంగాత మాజీ మంత్రి క్రీస్తు శేషులు స్వర్గీయ దువ్వాడ రత్నాకర్ రావు నాయకత్వంలో కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధి చెందినదని ప్రస్తుతం కోరుట్ల నియోజకవర్గ జువ్వాడి నర్సింగరావు నాయకత్వం లోని కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి బీసీ సెల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ గౌడ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దోడ రంజిత్ రెడ్డి సర్పంచులు ఎండీ రహీం సరకెళ్ళ లతిక నరేష్ చిట్నేని రమేష్ పల్లపు సుమలత అశోక్ ధ్యాగ గంగాధర్ ధ్యావనపెల్లి రామకృష్ణ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు జనార్దన్ మండల బీసీ సెల్ అధ్యక్షులు ముక్కెర లింబాద్రి మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి మరియు జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్ గౌడ్ మండల ప్రధాన కార్యదర్శులు దారిశెట్టి గణేష్ దేవయ్య మండల ఉపాధ్యక్షులు ఆర్మూరి గంగాధర్ ఎండీ జలీల్ కాంగ్రెస్ నాయకులు ముంజ రాజ గౌడ్ నగునూరి గంగాధర్ ఏనుగు రాకేష్ రెడ్డి సింగిరెడ్డి నవీన్ రెడ్డి అయిండ్ల గణేష్ మంద రంజిత్ సోహెల్ పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో రూ.16.93 లక్షల టోకరా

ముగ్గురిని మోసగించిన నిందితుడి అరెస్ట్.. మూడు కేసుల్లో రిమాండ్‌కు తరలింపు

వేములవాడ రూరల్, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :

విదేశాల్లో అధిక వేతనంతో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెట్టిన వ్యక్తిని వేములవాడ రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా డిచ్‌పల్లి మండలం యానాంపల్లి గ్రామానికి చెందిన వోస గంగాధర్ అలియాస్ పడాల రితీష్ (55) గతంలో ఫిజీ దేశానికి వెళ్లి ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేశాడు. అనంతరం భారత్‌కు తిరిగివచ్చి, విదేశాల్లో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. విదేశాలకు వెళ్లి మంచి వేతనంతో ఉద్యోగాలు చేయాలనుకునే వారిని లక్ష్యంగా చేసుకుని డబ్బులు తీసుకొని మోసం చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నాడు.ఈ క్రమంలో వేములవాడ రూరల్ మండలం ఫాజిల్‌నగర్ గ్రామానికి చెందిన ముగ్గురికి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి మొత్తం రూ.16,93,000 వసూలు చేసి మోసగించాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు మూడు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.కాగా, నిందితుడిపై గతంలో కొత్తపల్లి, రామాయంపేట, నిజామాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ గల్ఫ్ మోసాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లేవారు ప్రభుత్వ అనుమతి పొందిన ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని సూచించారు. అధిక జీతాల ఆశ చూపుతూ డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అమాయకులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటు హక్కు ప్రాముఖ్యత పై అవగాహన పెంపొందించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి
- ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించాలి
- నవంబర్ 2 నుంచి 18 వరకు మూడు స్థాయిల్లో పోటీల నిర్వహణ భారత ఎన్నికల సంఘం

జగిత్యాల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

భారత ఎన్నికల సంఘం యువతలో ఎన్నికల అవగాహనను పెంపొందించేందుకు చేపట్టిన కొత్త కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి సుదర్శన్ రెడ్డి గురువారం అన్ని జిల్లా ఎన్నికల అధికారులు జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ యువతలో ప్రజాస్వామ్య విలువలు ఎన్నికల ప్రక్రియ ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల (ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌లు) ద్వారా విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు.ఈ పోటీలను మూడు దశల్లో నిర్వహించనున్నారు మొదటి దశలో నవంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు పాఠశాలలు కళాశాలల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు అనంతరం నవంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు విద్యార్థుల్లో ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు విద్యార్థులు వ్యాసరచన క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థపై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన



ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు విద్యాసంస్థల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు యువతలో ఎన్నికల అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని ఎన్నికల ప్రక్రియలో చైతన్యవంతమైన యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హై స్కూల్, విద్యార్థులకు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)



రామగుండం సి. పి గారి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ SI లావణ్య గారి ఆధ్వర్యంలో పెద్దపెల్లి షీ టీమ్ వారు, 8 ఇంక్లైన్ కాలనీ లోని సింగరేణి సెక్టార్ -2 హై స్కూల్, విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్, గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, pocso యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు. మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు , అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే అన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లొ ట్రావెలింగ్ సేఫ్టీ అప్ T- Safe App వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లొ హెడ్ మాస్టర్ స్వర్ణలత మేడం గారు , ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ సభ్యులు, మౌనిక, సురేష్ పాల్గొన్నారు.

ప్రతి వార్డులో సమస్యలపై సర్పంచ్ ఆరా!

పారిశుధ్యం,వీధి దీపాలు,తాగునీటి సమస్యల పరిశీలన..

పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం పంపిణీపై ఆరా

ముత్తారం నవంబర్ 05(వుదయం ప్రతినిధి):



గ్రామంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లాలపల్లె గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం గురువారం వార్డు సభ్యులతో కలిసి ప్రతి వార్డులో పర్యటించారు.వార్డుల్లోని ప్రజలను నేరుగా కలిసి పారిశుధ్యం,వీధి దీపాలు,తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆయా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి,పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు వివరాలు సేకరించారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సర్పంచ్.. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అల్పాహార పంపిణీని పరిశీలించారు. ప్రతిరోజూ విద్యార్థులకు అల్పాహారం సక్రమంగా అందిస్తున్నారా?నిర్ణీత సమయంలో పంపిణీ చేస్తున్నారా?విద్యార్థులందరికీ సరిపడా అందుతుందా?అనే విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.అల్పాహారం నాణ్యత,పంపిణీ తీరును పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.పాఠశాలలో విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి,వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రాజేశం మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పారిశుధ్యం,తాగునీరు, వీధి దీపాల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే అల్పాహారం సక్రమంగా,నాణ్యతతో పంపిణీ అయ్యేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని,పాఠశాలలో మెరుగైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల కోసం ఆటో ఏర్పాటు

- మంత్రి శ్రీధర్‌బాబు చొరవ.. కలెక్టర్ ఆదేశాలతో రవాణా సౌకర్యం
- కేశన్‌పల్లి విద్యార్థుల సమస్యకు పరిష్కారం..
- ఆటో ఖర్చుల చెక్కు పంపిణీ చేసిన సర్పంచ్ తిరుమల కుమార్

ముత్తారం నవంబర్ 05(వుదయం ప్రతినిధి):



పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన స్థానిక సర్పంచ్ పెగడ తిరుమల కుమార్ చొరవ తీసుకున్నారు.విద్యార్థుల సమస్యను రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా.. మంత్రి స్పందించి జిల్లా కలెక్టర్‌కు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.దీంతో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థుల రవాణా కోసం ఆటో ఏర్పాటు చేయించారు.ముత్తారం మండలం కేశన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఈ సమస్య కారణంగా తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించేందుకు వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ తిరుమల కుమార్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి కృషి చేశారు.మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.కలెక్టర్ స్పందించి విద్యార్థుల రవాణా అవసరాల కోసం ఆటో ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఊరట లభించింది.గురువారం నిర్వహించిన విద్యార్థులు,తల్లిదండ్రుల సమావేశంలో సర్పంచ్ పెగడ తిరుమల కుమార్ పాల్గొన్నారు. వి ద్యార్థుల రవాణా కోసం కలెక్టర్ నిధుల ద్వారా మంజూరైన ఆటో ఖర్చుల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సదానందం పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లి దండ్రులను విస్మరించిన కుమారులు

వారి పేరిట ఉన్న గిఫ్ట్ డీడ్ రద్దు చేసిన కలెక్టర్

జగిత్యాల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

వృద్ధాప్యంలో తల్లి దండ్రుల పోషణను విస్మరించిన కుమారుల నుంచి వ్యవసాయ భూముల గిఫ్ట్ డీడ్ ను కలెక్టర్ రద్దు చేస్తు ఉత్తర్వులు జారీ చేయగా అట్టి ఉత్తర్వులను జిల్లా లోని మల్యాల మండలం లో అమలు చేసిన ఉదంతం చర్చనీయాంశంగా మారింది ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం మల్యాల కు చెందిన గుమ్లాపూర్ మల్లేశం లక్ష్మి అనే వృద్ధ తల్లిదండ్రులను ఇద్దరు కుమారులు సాకడం లేదంటూ దాదాపు రెండేళ్ల కిందట సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో జగిత్యాల ఆర్డీవో ను ఆశ్రయించారు ఆర్డీవో ఇచ్చిన తీర్పును ఆ వృద్ధుల కుమారులు పాటించకపోవడంతో వారు సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో తల్లిదండ్రులు అప్పిలేట్ ట్రిబ్యునల్ అధికారి అయిన కలెక్టర్ కు గిఫ్ట్ డీడ్ రద్దు కు అప్పీల్ చేశారు విచారణ జరిపిన కలెక్టర్ గతంలో తల్లిదండ్రులు తమ కుమారులకు గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవసాయ భూములను రద్దు చేయుటకు కలెక్టర్ వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద ఉత్తర్వులు జారీ చేశారు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మల్యాల తహసీల్దార్ శ్రీనివాస్ స్వయంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం కు వెళ్లి మల్లేశం పెద్ద కుమారుడు అయిన నరేష్ పేరిట ఉన్న 1 ఎకరం 12 గుంటల వ్యవసాయ భూమికి సంబందించిన గిఫ్ట్ డీడ్ ను సబ్ రిజిస్ట్రార్ ఇమ్రాన్ ఖాన్ చేత బుధవారం వరకు రద్దు చేయించారు ఈ రద్దు కని పెంచిన వృద్ధ తల్లి దండ్రులను నిరాదరిస్తున్న కుమారులకు కూతుర్లకు గుణపాఠంలా ఉందని ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అమలు చేయించిన మల్యాల తహసీల్దార్ శ్రీనివాస్ లకు తమ అసోసియేషన్ తరపున సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు

గంజాయి విక్రేతకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

రూ.10 వేల జరిమానా విధించిన పెద్దపల్లి జిల్లా కోర్టు

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి పెద్దపల్లి జిల్లా కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ముత్తునూరి ప్రభాకర్ అలియాస్ నగేష్ (19) 2021లో ఎల్లమ్మ ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అప్పటి ఎస్సై కే.రాజేష్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అతడి వద్ద రెండు కిలోల గంజాయి లభించడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, దర్యాప్తు పూర్తి చేసిన తర్వాత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి కే.సునీత నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకన రవి కీలక పాత్ర పోషించారు. పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, ఏసీపీ జి.కృష్ణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కే.ప్రవీణ్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ గడ్డం మల్లేష్, సీఎంఎస్ హెచ్‌సీ పి.కోటేశ్వరరావు కేసు విచారణకు సహకరించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించారు.

కాల్వ శ్రీరాంపూర్, మల్యాల గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కాల్వ శ్రీరాంపూర్, మల్యాల గ్రామాల్లో పలు కుటుంబాలను పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ దాసరి మనోహర్ రెడ్డి గారు పరామర్శించారు. ఈ సందర్భంగా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన సాంబ రావు కుటుంబాన్ని, మల్యాల గ్రామానికి చెందిన రామచంద్ర రెడ్డి కుటుంబాన్ని, ఉల్లి రాజయ్య గౌడ్ కుటుంబాన్ని కలిసి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు మనోధైర్యం కల్పిస్తూ, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీష అనిల్, మల్యాల సర్పంచ్ సదాశివరెడ్డి, మాజీ సర్పంచ్ రాజు,రవి, విష్ణు, శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2027 గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ధర్మపురిలో రూ.13 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- హాజరైన మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి



ధర్మపురి,నవంబర్5 (వుదయం ప్రతినిధి):

ధర్మపురి పట్టణంలో 2027 గో దావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్ర భుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్ ప్రత్యేక చొరవ,సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పట్టణంలో రూ.13 కోట్ల నిధులతో చేపట్టనున్న నూతన రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ము న్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్ శంకుస్థాపన చేశారు.ఎన్ హెచ్-63 పెట్రోల్ పంపు నుంచి అ య్యప్పస్వామి ఆలయం,కమ లాపూర్ రోడ్డు,దుర్గాకాలనీ వరకు డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం. ఎన్ హెచ్-63 నుంచి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా హరిత హోటల్ వరకు రోడ్డు నిర్మాణం.ఎన్ హెచ్-63 పుష్కర కాలనీ నుంచి శ్మశానవాటిక, హరిత హోటల్ వరకు రోడ్డు నిర్మాణ పనులు. పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం గా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినే ష్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, కౌన్సిలర్లు, అధికారులు, పాల్గొన్నారు.

ప్రజలే కుటుంబం.. ప్రజాసేవే ధ్యేయం!

- ఇంటి నుంచే టిఫిన్ బాక్స్.. వీలున్న చోటే భోజనం
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నిరంతర పర్యటన



మంథని, నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):

ప్రజలే కుటుంబంగా భావిస్తూ.. ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాటం.. మరోవైపు ఆపదలో ఉన్న కుటుంబాలకు పరామర్శలు, బాధితులకు భరోసా కల్పిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షణం తీరిక లేకుండా పర్యటించే ఆయన, భోజనం కోసం ప్రత్యేక సమయం కేటాయించకుండా ఇంటి నుంచే టిఫిన్ బాక్సుల్లో భోజనం తీసుకెళ్తూ, ఎక్కడ వీలైతే అక్కడే సాధారణంగా భోజనం చేస్తున్నారు. హంగులు, ఆర్భాటాలకు దూరంగా ప్రజా కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇస్తున్న ఆయన దినచర్య ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ప్రయాణంలో ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ సైతం తోడుగా ఉంటూ తనవంతు సహకారం అందిస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమం నిమిత్తం బయటకు వెళ్లిన పుట్ట మధూకర్ చెట్టునీడలో కూర్చుని భోజనం చేస్తుండగా, పక్కనే ఉన్న శైలజ ఆయనకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం వారి నిరాడంబర జీవనశైలిని ప్రతిబింబిస్తోంది. ప్రజల సమస్యలు వినడం, బాధిత కుటుంబాలను పరామర్శించడం, వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాలకే ప్రాధాన్యతనిస్తూ సాగుతున్న ఆయన పర్యటనల్లో భోజన విరామం సైతం సాధారణంగానే ఉంటోంది. వ్యక్తిగత సౌకర్యాల కంటే ప్రజా కార్యక్రమాలకే సమయం కేటాయిస్తూ ముందుకు సాగుతున్న పుట్ట మధూకర్ నిరంతర ప్రజా సంబంధాలు, నిరాడంబరత ఈ ఫొటో ద్వారా మరోసారి స్పష్టమవుతున్నాయి.



రాజన్న అభివృద్ధిలో జాప్యానికి తావులేదు

నిర్మాణాలు వేగవంతం చేయాలి..

క్షేత్రస్థాయిలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలన

వేములవాడ, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :


వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను గురువారం ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి నిర్మాణ పనికి కూలీల సంఖ్యను పెంచి, పనులు శరవేగంగా పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు వంతెన వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి నిర్మాణాన్ని పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ పరిశీలనలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ గ్రామానికి చెందిన బొద్దుల సురేష్ ఇటీవల మృతి చెందగా గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు యూసుఫ్ నగర్ గ్రామంలో గల సురేష్ ఇంటి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈపరామర్శలో కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల బీసీ సెల్ అధ్యక్షులు ముక్కెర లింబాద్రి సురేష్ ఉత్తకం రవీందర్ లకపతి రాజేందర్ రమేష్ పాల్గొన్నారు.



లక్ష్మీపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన..

ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

జగిత్యాల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మెంగు లక్ష్మీ రాజన్నర్సు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ గురువారం నిర్వహించారు నూతన గృహప్రవేశ వేడుకలకు జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ హాజరయ్యారు ఈ సందర్భంగా లబ్ధిదారులకు చీరను కానుకగా అందజేసి నూతన గృహాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి ఉప సర్పంచ్ సత్తిరెడ్డి ధర్మారం సర్పంచ్ మల్లేష్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం నాయకులు పురిపాటి రాజిరెడ్డి మాజీ ఎంపీటీసీ గిద్దె శంకర్ నల్ల స్వామి రెడ్డి దనేశ్వర్ రావు సత్తవ్వ వార్డు సభ్యులు లత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

400 కిలోమీటర్ల సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి



బీఆర్ఎస్ బృందానికి ఘన సన్మానించిన మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి పెద్దపల్లికి చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ సైకిల్ యాత్ర బృందానికి పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి గారు తన స్వగృహంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర ఉప్పు రాజ్ కుమార్ బృంద సభ్యులైన కాశీపాక వాసు, సురేష్, లక్ష్మణ్‌లకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దాసరి ప్రశాంత్ రెడ్డి గారు కూడా పాల్గొని యాత్ర బృంద సభ్యులను అభినందించారు.తెలంగాణ ఆత్మగౌరవం, రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ సైకిల్ యాత్ర విజయవంతంగా పూర్తిచేయడం అభినందనీయమని దాసరి మనోహర్ రెడ్డి గారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలనే సంకల్పం, రైతుల పట్ల ఉన్న నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తికి ఈ యాత్ర నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, ఓదెల నాయకులు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు గుణపతి, టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్, సురేష్, పుదరి చంద్రశేఖర్, పెంచల శ్రీధర్, ముత్యాల రాజయ్య, గుర్రాల శ్రీను, గోపి, శ్రీనివాస్, నాగరాజు, మధు తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :



వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తూం మధు, కాశ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, నాంపల్లి గుట్ట ఆలయ అర్చకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కరువుతో ఎండిన వరి పొలాలు.. రైతులను వెంటనే ఆదుకోవాలి

- ఎకరానికి రూ.30 వేల పంట నష్టపరిహారం చెల్లించాలి
- కరువు పరిస్థితులపై మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఆవేదన
- రంగారావుపేటలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించిన సీపీఐ నాయకుల బృందం



మెట్‌పల్లి 05 నవంబర్ వుదయం ప్రతినిధి

కరువు పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ సీనియర్ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించి వారికి భరోసా కల్పించాలని కోరారు.రాష్ట్రంలో కరువు పరిస్థితులతో అల్లాడుతున్న రైతుల కష్టాలను తెలుసుకొని వారికి అండగా నిలవాలన్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం జగిత్యాల జిల్లా సీపీఐ నాయకుల బృందం మెట్‌పల్లి మండలం రంగారావుపేట గ్రామంలో పర్యటించింది. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథంతో పాటు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరువు పరిస్థితుల కారణంగా వరి పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని చాడ వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు తక్షణమే సేకరించి, క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఎకరానికి రూ.30 వేల పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి

కరువు పరిస్థితుల్లో రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాలను పెంచాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు. సన్న, చిన్నకారు, కౌలు రైతుల కుటుంబాలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టి గ్రామీణ ప్రజలకు అండగా నిలవాలని ప్రభుత్వానికి సూచించారు.

నిత్యవసర సరుకులు బియ్యం ధరల పెంపుపై చర్యలు తీసుకోవాలి

ఎల్‌నినో ప్రభావం పేరుతో కొందరు దళారులు బియ్యం ధరలను కృత్రిమంగా పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. కిలో బియ్యాన్ని సుమారు రూ.100కు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో నాయకులకు స్వాగతం

రంగారావుపేట గ్రామ పంచాయతీని సందర్శించిన చాడ వెంకట్ రెడ్డిని గ్రామ సర్పంచ్ గుర్రాల బాలరాజు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునుగురు హనుమంతు, ఎండి అక్రం, వెన్న సురేష్, రాదక్క, ఏఐటీయూసీ బీడీ కార్మిక సంఘం అధ్యక్షుడు సుతారీ రాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్, ఖాతా వినయ్,సత్తక్క గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటన

- రూ.9,100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం
- రైతులు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశాలు

మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు రూ.9,100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.

నవంబర్ 7వ తేదీ (శనివారం)

ముఖ్యమంత్రి ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకుంటారు.

ఉదయం 11.10 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రదర్శన స్టాళ్లను సందర్శిస్తారు.

మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. ఒంటి గంట నుంచి 2 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు.

మధ్యాహ్నం 3 గంటలకు హకీంపేట నుంచి రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి బయలుదేరుతారు. రాత్రి కొడంగల్‌లో బస చేస్తారు.

నవంబర్ 8వ తేదీ (ఆదివారం)

ఉదయం 9.15 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హకీంపేట చేరుకుంటారు.

9.30 నుంచి 10.20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు.

10.20 గంటలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.

ఉదయం 10.30 కు లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన.

ఉదయం 10.45 కు హకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు.

ఉదయం 11 కు రూ.2.35 కోట్లతో నిర్మించిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

ఉదయం 11.30 గంటలకు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను, 11.45 గంటలకు రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 12.15 గంటలకు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 12.45 గంటలకు దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, 1.15 గంటలకు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 1.40 గంటలకు కోస్గి మండలం నాచారం గ్రామంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు–2కు శంకుస్థాపన చేస్తారు. ఈ రహదారిని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వద్ద జాతీయ రహదారి 167ఎన్ వరకు నిర్మించనున్నారు.

మధ్యాహ్నం 2 గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 2.45 గంటలకు దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 3.30 గంటలకు దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు–2, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు ఉన్నాయి. విద్యా రంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ఉన్నాయి. రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్లు, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (NAC) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు.

రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 భవనాల ప్రారంభం

రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న



10 ప్రభుత్వ భవనాలను ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. దుద్యాల సమీకృత మండల కార్యాలయ భవనం, కోస్గి సైన్స్ మ్యూజియం, హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు, హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీటిలో ఉన్నాయి. దుద్యాల, బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్లు, బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొడంగల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

నవంబర్ 9వ తేదీ (సోమవారం)

సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు బయలుదేరుతారు.

రాత్రి 7 గంటల వరకు హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల నుంచి దాదాపు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ.. తస్మాత్ జాగ్రత్త

- చెల్లింపులకు ముందు వ్యక్తి వివరాలు సరిచూసుకోవాలి
- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) ,:

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను మోసగిస్తూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచించారు. 'యువర్ మనీ.. యువర్ క్లిక్.. యువర్ ఛాయిస్' నినాదంతో నవంబర్ నెలంతా జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే ముందు క్షణం ఆగి, నగదు స్వీకరించే వ్యక్తి లేదా సంస్థ వివరాలను ధ్రువీకరించుకోవాలని సూచించారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, అధిక లాభాల ఆశ చూపే పెట్టుబడి పథకాలు, స్క్రీన్ షేరింగ్ యాప్‌ల ద్వారా జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.గూగుల్, సోషల్ మీడియాలో కనిపించే ప్రతి



కస్టమర్ కేర్ నంబర్‌ను నమ్మవద్దని, అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించరాదన్నారు. చెల్లింపులకు ముందు లబ్ధిదారుడి పేరు, ఖాతా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలువరించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

గీతా కార్మికుల అభివృద్ధి కోసం 1లక్ష 50వేల ఎంపీ నిధుల మంజూరు

ప్రొసీడింగ్ కాపీని గౌడ్ కార్మికులకు అందించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజక వర్గ ఇంచార్జ్ డాక్టర్ వై అనూప్ రావు జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు

కోరుట్ల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మండలం సంగెం గ్రామంలో గీతా కార్మికుల అభివృద్ధి కోసం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఎంపీ నిధుల నుండి ఈత వనంలో బోరు రిగ్గు కోసం 1 లక్ష 50 వేల మంజూరు కాగా ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనూప్ రావు బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు గీతా కార్మిక సంఘం సభ్యులకు గ్రామ బీజేపీ నాయకులతో కలిసి అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కార్మికుల అభివృద్ధి కోసం ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు అభివృద్ధికి సహకరించిన ఎంపీకి గీతా కార్మిక సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుగ్గిల తుకారాం గౌడ్ జిల్లా కార్యదర్శి సుధవేణి మహేష్ గౌడ్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు అంబల్ల సుదర్శన్ సీనియర్ నాయకులు సంకు



నరేందర్ గౌడ సంఘం అధ్యక్షులు రంగు శ్రీనివాస్ గౌడ్ గౌడ సంఘం నాయకులు మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంక గౌడ్ వలకొండ దామోదర్ గౌడ్ రంగు శంకర్ గౌడ్ వల్లకొండ గంగారాం గౌడ్ ఉప సర్పంచ్ సుధవేణి మహేష్ గౌడ్ బిజెపి నాయకులు వల్లకొండ గంగారాం నల్ల రాజం పోతుగంటి సత్యనారాయణ గౌడ్ బిజెపి వార్డ్ మెంబర్ వల్లకొండ రణధీర్ పోతుగంటి జీవన్ పల్లి రంజిత్ పర్స భూమయ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్
- అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- పెద్దపల్లిలోని సూపర్ మార్కెట్లలో పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారుల సంయుక్త తనిఖీలు
- అధిక ధరలకు బియ్యం విక్రయించిన శ్రీ సాయి సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్ స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా కూనారం రోడ్డులోని ఏజీ మార్ట్ సూపర్ మార్కెట్‌లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి బియ్యం విక్రయ ధరలను పరిశీలించారు.

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలు ఇవే

తెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యానికి కిలో చొప్పున నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలు ఈ విధంగా ఉన్నాయి.

బీపీటీ / కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ / జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79 చొప్పున విక్రయించాలి.

ఈ ధరలకు మించి బియ్యం విక్రయించరాదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.



ప్రతి సూపర్ మార్కెట్, బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కె. శ్రీనాథ్ హెచ్చరించారు.

వినియోగదారులు కూడా బియ్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పరిశీలించాలని సూచించారు.

ఈ తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్, డీటీ పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం.. పోలీసుల మానవత్వం

- ఫిట్స్‌తో రోడ్డుపై కుప్పకూలిన వ్యక్తికి క్షణాల్లో అండగా నిలిచిన వేములవాడ పోలీసులు
- పోలీసులకు స్థానికుల అభినందనలు

వేములవాడ నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :

ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకోవడంలోనూ వేములవాడ పట్టణ పోలీసులు ముందున్నారు,వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం శివ అనే వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో రోడ్డుపై కుప్పకూలిపోయాడు, ఈ



ఘటనను గమనించిన విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లు సల్మాన్, షకీల్, పంతులు నాయక్, నరేందర్, సతీష్ కుమార్, రాజ్‌కుమార్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బాధితుడి వద్దకు చేరుకొని అత్యవసర పరిస్థితిని గుర్తించిన పోలీసులు బాధితుడికి తక్షణ సాయం అందిస్తూ ప్రథమ చికిత్స చేశారు,చేతులు, కాళ్లు రుద్దుతూ అతడికి సహాయం చేయడంతో కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చాడు,విధి నిర్వహణలో ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో స్పందించి ఓ నిండు ప్రాణానికి అండగా నిలిచిన పోలీసుల తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తూ యూనిఫామ్ వెనుక మానవత్వం ఉందని చాటిన పోలీసు సిబ్బంది సేవలను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- కోనరావుపేటలో రూ.95.50 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- విద్యకు పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల/కోనరావుపేట, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి గదులతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.కోనరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షలతో నూతన వసతి గృహం, టాయిలెట్ల నిర్మాణానికి, రూ.9.50 లక్షలతో భవిత కేంద్రం, రూ.30 లక్షలతో ఐకేపీ గోడౌన్ నిర్మాణానికి గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడంతో పాటు విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంద




న్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తూ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులోకి వచ్చే వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కేజీబీవీ, భవిత కేంద్రం, ఐకేపీ గోడౌన్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్లు చేపూరి గంగాధర్, బొమ్మెన భాస్కర్ రావు, ఆర్డీఓ కేవీఎన్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ కాశిరాం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని దేవరాజు, తహసీల్దార్ వరలక్ష్మి , ఎంపీడీఓ స్నిగ్ధ, జీసీడీఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో 64 ఉద్యోగాల భర్తీకి నవంబర్ 10న జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్
- సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ
- ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 10న ఉదయం 11 గంటలకు హాజరుకావాలి

పెద్దపల్లి, నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల నవంబర్ 10వ తేదీ మంగళవారం రోజున జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తు, గది నంబర్ 233, పెద్దకల్వల, పెద్దపల్లిలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 64 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిలో 60 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు, 4 ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలని, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పురుషులు, మహిళలు ఇద్దరూ అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 నుంచి రూ.18,000 వరకు జీతంతో పాటు TA-DA, ఇన్సెంటివ్స్ అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు పెద్దపల్లి జిల్లా పరిధిలోనే పని ప్రదేశం ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 10వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు తమ అప్‌డేటెడ్ సీవీ / రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, అప్‌డేటెడ్ ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





కోరుట్ల పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే డాక్టర్ యం కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణ ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు ఈ సందర్భంగా ఏకిన్ పూర్ శివారులో గల ఎస్సారెస్పీ (ఎస్ఆర్ఎస్పి) దగ్గర గల నుంచి తాళ్ల చెరువుకు అలైన్‌మెంట్ ద్వారా నీటిని నింపి అక్కడి నుంచి నీటిని శుద్ధి (ఫిల్టర్) చేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే తెలిపారు మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏవైనా అంతరాయాలు ఏర్పడిన కరువు పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో ఈ ప్రత్యామ్నాయ విధానం ద్వారా పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు అలైన్‌మెంట్ పనుల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత రైతులతో ముందస్తుగా చర్చించి.వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు ఈ ప్రత్యామ్నాయ నీటి సరఫరా విధానం అందుబాటులోకి వస్తే కోరుట్ల పట్టణంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా నివారించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జీవాకర్ తహసీల్దార్ కృష్ణచైతన్య మున్సిపల్ కమిషనర్ ఇరిగేషన్ రెవెన్యూ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షీటర్లపై ఎస్పీ హుకుం.. పోలీసుల ఉక్కుపాదం

- జిల్లావ్యాప్తంగా అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు..రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా
- శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు.. ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా,నవంబర్ 05 (వుదయం ప్రతినిధి) :

జిల్లాలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, వారి కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనూ ఉపేక్షించవద్దని, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు మెరుపు తనిఖీలు నిర్వహించారు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ఇళ్లకు వెళ్లి వారి ప్రస్తుత కార్యకలాపాలు, కదలికలు, జీవన విధానంపై ఆరా తీశారు,నేరాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు...

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గీతే స్పష్టం చేస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ప్రతి కదలికను



పోలీసులు నిశితంగా పరిశీలిస్తారని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజా జీవనానికి ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు.నేరాలకు దూరంగా ఉంటూ దీర్ఘకాలంగా సత్ప్రవర్తనతో జీవిస్తున్న వారిని గుర్తించి, పోలీసు నిబంధనల ప్రకారం షీట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సంబంధిత వ్యక్తులు పోలీసు అధికారులు సూచించిన సమయాల్లో తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్లకు హాజరుకావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బైండోవర్ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

గ్రామ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయించండి

కోరుట్ల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలోని వివిధ అభివృద్ధి పనుల ఎంపీ నిధులు మంజూరు చేయించాలని కోరుతూ గురువారం చెన్నమనేని వికాస్ ని కలిసి వినతిపత్రం అందజేసిన సిరికొండ సర్పంచ్ మూదాం రవి శానుకూలంగా స్పందించిన వికాస్ ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి బీజేపీ సీనియర్ నాయకులు బద్రి సత్యం గాందారి శ్రీనివాస్ కాసోజి ప్రతాప్ ముంజ వెంకటేష్ ఆరే శివ కుమార్ గుర్రాల లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీ

ముత్తారం నుంచి కమాన్‌పూర్, రామగిరి మండలాలకు మధుకర్,సతీష్.. కొత్తగా ఇద్దరు ఆపరేటర్లు విధుల్లో చేరిక

ముత్తారం నవంబర్ 05(వుందాయం ప్రతినిధి): ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీల్లో భాగంగా ముత్తారం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఆపరేటర్లు ఇతర మండలాలకు బదిలీ అయ్యారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధుకర్ కమాన్‌పూర్ మండలానికి,సతీష్ రామగిరి మండలానికి బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఓదెల,కాల్వ శ్రీరాంపూర్ మండలాల నుంచి ప్రశాంత్,సతీష్‌లు ముత్తారం మండలానికి బదిలీపై వచ్చి గురువారం విధుల్లో చేరారు.మండలంలో ఈ పంచాయతీ సేవలకు సంబంధించిన కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలతో కొత్త సిబ్బంది బాధ్యతలు చేపట్టారు. బదిలీపై వచ్చిన ఆపరేటర్లు గురువారం విధుల్లో చేరడంతో ఈ పంచాయతీ సేవలు కొనసాగనున్నాయి.

ప్రజల తాగునీటి కొరత నివారణకు ముందస్తు చర్యలు సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి

వుదయం ప్రతినిధి కొండమల్లేపల్లి:

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొండమల్లేపల్లి గ్రామంలోని 8వ, 10వ వార్డుల్లో నూతనంగా బోర్లను ఏర్పాటు చేయించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధి దిశగా సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపించారు.ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో వార్డులవారీగా సమస్యలను గుర్తిస్తూ అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజా



అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ యుగంధర్ రెడ్డి తెలిపారు.తమ తాగునీటి అవసరాలను గుర్తించి నూతన బోర్లను ఏర్పాటు చేయించడం పట్ల 8, 10వ వార్డుల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు గంట మల్లేష్, బిజిలి లింగం, వస్కుల స్వప్న శ్రీను, వస్కుల బక్కలయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హోంగార్డులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెక్కులు అందజేసిన జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్





జగిత్యాల నవంబర్ 05 (వుదయం ప్రతినిధి)

పోలీస్ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హోంగార్డుల సేవలను గుర్తిస్తూ వారికి ప్రభుత్వం మంజూరు చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో భాగంగా హోంగార్డులు నరసింహులు వెంకయ్యలకు ఒక్కొక్కరికి 1లక్ష 30 వేల రూపాయల చొప్పున మంజూరైన చెక్కులను జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు ఎంతో విలువైనవని పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధి నిర్వహణలో వారు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు పదవీ విరమణ అనంతరం కూడా వారి సంక్షేమానికి పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వం తరపున వారికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు

డబ్బుల కోసం మొక్కజొన్న రైతుల పోరుబాట

- రూ.32 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్
- జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ధర్నా

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 5 :

ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను విక్రయించి ఏడాది గడుస్తున్నా డబ్బులు చేతికి అందక రైతులు ఆందోళన బాట పట్టారు. తమకు రావాల్సిన సుమారు రూ.32 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పంట కొనుగోలు చేసి ఏడాది గడుస్తున్నా పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని జైనథ్, బేల, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్, భీంపూర్ మండలాలకు చెందిన సుమారు 300 మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఏలూరుకు చెందిన వ్యాపారి చీకటి శ్రీనివాసరావుకు సంబంధించిన చాందిని సీడ్స్ సంస్థ తమ నుంచి ఏడాది క్రితం మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిందని, ఇప్పటివరకు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. బకాయిల కోసం పలుమార్లు సంప్రదించినా సరైన స్పందన రావడం లేదని వాపోయారు. పంట విక్రయించిన డబ్బులతో తదుపరి సాగుకు పెట్టుబడులు పెట్టుకోవాల్సి ఉండగా, చెల్లింపులు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు కుటుంబ ఖర్చులకూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి చాందిని సీడ్స్ సంస్థ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌లో కొనుగోళ్లు లేక చెల్లింపుల్లో జాప్యం : వ్యాపారి శ్రీనివాసరావు

ఈ విషయమై వుదయం ప్రతినిధి వ్యాపారి శ్రీనివాసరావును ఫోన్‌లో సంప్రదించగా.. రైతుల నుంచి ఏడాది క్రితం మొక్కజొన్న కొనుగోలు చేసిన మాట వాస్తవమేనని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో మార్కెట్‌లో కొనుగోళ్లు జరగకపోవడంతో పంట నిల్వలన్నీ కోల్డ్ స్టోరేజీలో ఉంచినట్లు వివరించారు. గత ఐదారు సంవత్సరాలుగా బెంగళూరు నుంచి వ్యాపారులు వచ్చి మొక్కజొన్న నిల్వలను కొనుగోలు చేసేవారని, ఈసారి వారు కూడా తక్కువ ధరకు అడగడంతో విక్రయించలేకపోయానన్నారు. అత్యవసర అవసరాలు ఉన్న రైతులకు ప్రాధాన్యమిస్తూ ఇప్పటికే 25 నుంచి 45




శాతం వరకు చెల్లింపులు చేసినట్లు చెప్పారు. కొంతమంది రైతులు తమ పంటను ఇతరులకు విక్రయించుకుంటామని, నిల్వలను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇతర వ్యాపారులతో విక్రయ ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తనకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికే రైతులకు చెల్లించిన డబ్బులు కూడా కోల్పోవాల్సి వస్తుందనే ఆందోళనతో హైకోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు. ఏ ఒక్క రైతు డబ్బు కూడా మిగలకుండా అందరికీ న్యాయం చేయాలనే ప్రయత్నంలో ఉన్నానని, ఇందుకు కొంత సమయం ఇవ్వాలని కోరినట్లు శ్రీనివాసరావు వివరించారు.

బోటనీ పీజీటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట,వుదయం

నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గంటల ప్రాతిపదికన పనిచేసేందుకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (బోటనీ) పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ. రాంప్రసాద్ తెలిపారు. బోటనీ సబ్జెక్టులో ఎంఎస్సీ, బీఈడీ అర్హత కలిగిన వారు ఈ నెల 11వ తేదీలోగా బయోడేటా, విద్యార్హతలు, అనుభవ ధ్రువీకరణ పత్రాలను పాఠశాలలో సమర్పించాలన్నారు. ఎంపికైన వారికి ఒక్కో పీరియడ్‌కు రూ.182 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు డెమో క్లాస్ నిర్వహించి ఎంపిక చేస్తామని, ఇతర సబ్జెక్టుల అర్హులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు పని వేళల్లో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.



ప్రేమించిన యువకునితో వివాహం

ఫలించిన యువతి దీక్ష

దండేపల్లి: నవంబర్ 05 (వుదయం విలేఖరి)

దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఉపారపు అక్షర,అదే గ్రామానికి చెందిన మగ్గిడి మహేందర్ ల ప్రేమకథ సుఖాంతం అయింది... వివరాల్లోకి వెళితే మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఉపారపు అక్షర అదే గ్రామానికి చెందిన మగ్గిడి మహేందర్ కొన్ని సంవత్సరాల నుండి ప్రేమించుకుంటున్నారు అక్షర మహేందర్ తో ఇద్దరం వివాహం చేసుకుందాం అని అడుగగా నిరాకరించి ఆదివారం ఇంటికి తాళం వేసి వెళ్లారు అక్షర అదే రోజు నుండి ఐదు రోజులుగా మహేందర్ ఇంటి ముందు దీక్షకు కూర్చుంది ఈ నేపథ్యంలో గురువారం గ్రామ పెద్దల సమక్షంలో వివాహం చేసుకుని ఒక్కటయ్యారు.



చెట్టు నరికివేతపై అటవీ శాఖ కేసు నమోదు

లక్షెట్టిపేట, నవంబర్ 5 (వుదయం న్యూస్):

అనుమతులు లేకుండా చెట్టును నరికివేసిన ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్ర కాలనీ సమీపంలో గురువారం ఈ ఘటన వెలుగుచూసింది.అటవీశాఖ అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు బిరుదుల చిన్నరాజుకు చెందిన భూమి పక్కన ఉన్న కెనాల్ గట్టుపై ఉన్న దురుషణం చెట్టును అనుమతులు లేకుండా నరికివేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చెట్టు కొలతలను నమోదు చేశారు.అనంతరం నిబంధనలకు విరుద్ధంగా చెట్టును నరికివేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అల్తాఫ్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు చంద్రశేఖర్, సుమలత పాల్గొన్నారు.





అన్నదాతల అ(వ)రి గోస

- కడెం నీరు బంద్ చేయడంతో రైతుల ధర్నా
- నోటికాడి భువ్వను లాక్కుంటున్నారంటూ తీవ్ర ఆగ్రహం

జన్నారం,నవంబర్ 5 (వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామ రైతులు నీటి కోసమై రోడ్డెక్కారు.గత రెండు రోజుల క్రితం నుండి కడెం ప్రాజెక్ట్ నుండి పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని ప్రకటన రావడం, నీళ్లు బంద్ చేయడంతో చివరి ఆయకట్టు రైతులు ఆందోళనకు గురై బుధవారం రోజున ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తిమ్మాపూర్, రాంపూర్ రైతుల పొలాలు పొట్ట దశలో ఉన్నాయని ఈ నెల 30వ తారీకు వరకు నీళ్లు వదలాలని ,లేని యెడల మాకు ఆత్మహత్యలే దిక్కు అని అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఈ సమాచారం అందుకున్న జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి,రైతులతో మాట్లాడి సముదాయించడంతో వారు తాత్కాలికంగా రాస్తారోకోను విరమింప చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం జన్నారం మండల మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్,ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దండారి నృత్యాల్లో సందడి చేసిన బాపురావు

డోలీ చప్పుళ్లతో ఘన స్వాగతం..

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 5 :

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారి ఉత్సవాల్లో బోథ్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపురావు సందడి చేశారు. ఇచ్చోడ మండలం బాదిగూడ గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు డోలీ చప్పుళ్లు, దండారి నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. గుస్సాడీలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల కోసం కొమురం భీం చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

గత సేవలను గుర్తుచేసుకున్న గ్రామస్తులు

బాపురావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేసిన కృషిని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో తమ గ్రామానికి, ప్రాంతానికి చేసిన సేవలను మరువలేమని, భవిష్యత్తులోనూ ఆయనకు అండగా ఉంటామని, తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామస్తుల అభిమానానికి బాపురావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేళ్లు, మండల కన్వీనర్ షేక్ భిలాల్ బాయ్, మైనార్టీ మండల చైర్మన్ షేక్ ఫరీద్, సిరికొండ మండల కన్వీనర్ సతీష్ జాదవ్, గులాబ్, జైసున్, హుస్సేన్, అత్తహుళ్ల కలీం తదితరులు పాల్గొన్నారు.



జైరాం రమేశ్‌తో ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతల భేటీ

పార్టీ బలోపేతం, జిల్లా అభివృద్ధిపై చర్చలు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 4 :

డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కూడిన జిల్లా కాంగ్రెస్ నాయకులు బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ, జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలపై ఆయనతో చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆదిలాబాద్ జిల్లాతో జైరాం రమేశ్‌కు ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ పాల్గొన్నారు.





మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు మిషన్ శిక్షణ

నాగిరెడ్డిపేట,వుదయం

గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో JJWES (జల్ జీవన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామంలో శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది మహిళలకు సర్పంచ్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.గ్రామీణ మహిళలకు టైలరింగ్ నైపుణ్యాలు నేర్పించి, ఇంటి నుంచే ఆదాయం సంపాదించుకునేలా ప్రోత్సహించడమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో మహిళల సాధికారత కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఈ సంస్థ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అంజమ్మ, టైలరింగ్ శిక్షకురాలు సునీత, అంగన్‌వాడీ సమన్వయకర్త వజ్రవ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మహారాష్ట్ర వాసి మృతి

దండేపల్లి నవంబర్ 05 (వుదయం విలేఖరి)

మండలంలోని గుడిరేవు గోదావరిలో మునిగి పెందూర్ దివాకర్ (30) అనే యువకుడు మృతి చెందాడు దండేపల్లి ఎస్ఐ గుండేటి రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం గుడిరేవులోని పద్మల్పురి కాకోబాయి అమ్మవారి దర్శనానికి వచ్చిన మహారాష్ట్రలోని రాజుర తాలుక,గెర్రెగూడ గ్రామానికి చెందిన పెందూర్ దివాకర్ గోదావరిలోకి స్నానానికి వెళ్లి నీట మునిగాడు గమనించిన స్థానికులు బయటకు తీశారు ప్రాణాలతో ఉన్న అతనిని వెంటనే లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు మృతుని భార్య పెందూర్ స్నేహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గుండేటి రాజవర్ధన్ తెలిపారు.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

జన్నారం,నవంబర్ 5 (వుదయం విలేఖరి)

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను సీజ్ చేసినట్లు జన్నారం ఎఫ్ఆర్ఓ ఎస్ కే బాబా ఖాదర్ వలి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతగూడ గ్రామం వద్ద వాహనల తనిఖీ సమయంలో సరైన అనుమతి పత్రాలు లేకుండా అర్ధరాత్రి వేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ఇసుక టిప్పర్‌ను తమ సిబ్బందితో కలిసి సీజ్ చేసి రేంజ్ కు తరలించామని పేర్కొన్నారు. పట్టుకున్న టిప్పరు కాంట్రాక్టర్ రమేష్ రావు, ఓర్సు మల్లేష్,రాజమల్లు లకు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు.సీజ్ చేసిన వాహనాన్ని ఇసుక లోడ్‌తో సహా సురక్షిత కస్టడీలో ఉంచడం జరిగిందని నిబంధనల ప్రకారం తదుపరి విచారణ కొనసాగుతుందని రేంజ్ అధికారి వివరించారు.ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులో భారతి ఎస్ సీ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సుమారు రూ.22 లక్షలతో పాఠశాల భవనాన్ని నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించిన భారతికి, ఎస్ సీ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్స్ బోజన్నగారి వినోద రాజు పాటిల్, మాధవి, టిపిఓ దేవరాజు, డీఈవో మల్లికార్జున్, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పద్మల్పురి కాకోబాయి (ఎత్మసార్) దర్బార్



దండేపల్లి: నవంబర్ 05 (వుదయం విలేఖరి)

దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరంలోని పద్మల్పురి కాకోబాయి(ఎత్మసార్) ఆలయంలో గురువారం దండారి,గుస్సాడీ,దర్బార్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఐదు రోజుల పాటు సాగిన ఈ ఉత్సవాలు గురువారంతో ముగిసాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ ఎంపి గెడెం నాగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై పద్మల్పురి కాకోకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పాయసంతో పాటు రుబ్బిన పెసర, మినుములు,బబ్బెర గారెలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దంచిన బియ్యంతో తయారు చేసిన అరిసెలు నైవేద్యం సమర్పించారు. అనంతరం మేకలు,కోళ్లు బలిచ్చి ఆలయం సమీపంలో వంటలు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు.దండారీ ఉత్సవాలకు ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా గోదావరి నదికి కాలినడ చేరుకున్నారు. అక్కడ పుణ్య స్నానాలు ఆచరించి,నది జలాలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీలు ముఖ్యంగా గోండు,కోలాం తెగలు ఎంతో పవిత్రంగా పూజించే ఇలవేల్పు మరియు ప్రధాన పుణ్యక్షేత్రం.దక్షిణ భారతదేశంలోనే ఆదివాసీలు ఆరాధించే ఏకైక శక్తిపీఠంగా మరియు కాకోబాయి అమ్మవారి ఏకైక ఆలయంగా ఇది ప్రాచుర్యం. కాకోను జలదేవత అయిన 'నిరంజన్ గురు' ఏడో కుమార్తెగా విశ్వసిస్తారు. ఆదివాసీలు.దండారి, గుస్సాడి,దర్బార్ ప్రతి సంవత్సరం దసరా నుండి దీపావళి సమయాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు నెమలి ఈకల టోపీలు ధరించిన గుస్సాడీ భక్తులు (గుస్సాడీ తాడోలు), తుడుం,పెపెరే,డప్పు వంటి వాయిద్యాల మోత నడుమ ప్రత్యేక పూజలు మరియు నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి తెలంగాణలోని మంచిర్యాల,ఆసిఫాబాద్, ఆదిలాబాద్,నిర్మల్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్,మధ్య ప్రదేశ్ నుంచి వేలాది మంది ఆదివాసీ భక్తులు ఈ ఆలయానికి తరలి వచ్చారు ఆదివాసీల సంస్కృతి, జీవనవిధానం మరియు దండారి-గుస్సాడి సంప్రదాయాలకు ఈ పుణ్యక్షేత్రం ఒక ముఖ్యమైన సాంస్కృతిక కేంద్రంగా భాసిల్లుతోంది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ మాజీ ఎంపీ,మాజీ ఎమ్మెల్యే సోయం బాపూరావు, డిసిసి మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ,లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు,రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ మాజీ చైర్మన్ కోట్నాక తిరుపతి,ఆలయ కమిటీ చైర్మన్ కొమురం అనంతి,సర్పంచ్ సంతపురి కళావతి,ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గద్దం త్రిమూర్తి, లక్షెట్టిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బియ్యాల తిరుపతి,మాజీ సర్పంచ్ మంజు భార్గవి వివిధ గ్రామాల సర్పంచ్లు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాం

బ్రాహ్మణపల్లి సర్పంచ్ గరేబోయిన చంద్రకళ

నిజాంసాగర్, నవంబర్ 5 (వుదయం ప్రతినిధి):

గ్రామీణ మహిళల అభ్యున్నతికి అవసరమైన వసతులు కల్పిస్తూ, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ గరేబోయిన చంద్రకళ వెంకటేశం తెలిపారు. నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో మహిళా సంఘాల కోసం నూతన భవనాల నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గరేబోయిన చంద్రకళ వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రజా పండరి, మహిళా సంఘాల సభ్యులతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు అందుబాటులోకి రావడం వల్ల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను సులభంగా నిర్వహించుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. మహిళలు ఐక్యంగా ముందుకు సాగుతూ సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఈ భవనాలు దోహదపడతాయని అన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం గ్రామస్థాయిలో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి మాట్లాడుతూ... గ్రామీణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాల భవనాలు అందుబాటులోకి రావడం గ్రామ మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, నాయకులు గరేబోయిన వెంకటేశం, చిరంజీవి, రామ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో సద్దుమణిగిన అసమ్మతి!

కౌన్సిలర్లు, అధికారులతో చైర్‌పర్సన్ సమావేశం

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 5 :

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో కొంతకాలంగా నెలకొన్న అసమ్మతికి ప్రస్తుతానికి తెరపడింది. కౌన్సిలర్లు, అధికారుల మధ్య సమన్వయం పెంపొందించడంతో పాటు ప్రజాప్రతినిధులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించే దిశగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ చొరవ తీసుకున్నారు. ఈ మేరకు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. కౌన్సిలర్లు తమ పరిధిలోని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పుడు వాటికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కౌన్సిలర్లకు సంబంధించిన మోటేషన్లు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పరిపాలనాపరమైన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే పట్టణ అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని పేర్కొన్నారు. చిన్నచిన్న సమస్యలు సైతం జాప్యానికి దారితీయకుండా సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం దెబ్బతింటే దాని ప్రభావం నేరుగా ప్రజాసేవలపై పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ నిర్వహించిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు జిల్లాలోని సీసీఐ చెల్లింపులు, అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్ తదితర సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఈ అంశాలపై ఉన్నతస్థాయిలో చొరవ తీసుకుంటానని భరోసా కల్పించారు.




ఆధ్యాత్మిక మార్గమే అత్యుత్తమ మార్గం

భగవద్గీత పుస్తకాలు ఆవిష్కరించిన మాదాడి పూర్ణచంద్రరావు

జన్నారం,నవంబర్ 5 (వుదయం విలేఖరి)

ఆధ్యాత్మిక మార్గమే అత్యుత్తమ మార్గమని మాదాడి పూర్ణచంద్రరావు అన్నారు. జన్నారం మండల కేంద్రంలో బుధవారం రోజున సద్గురు శ్రీ శ్రీ యోగానంద భారతి స్వామివారి ఆశీర్వాదంతో మాదాడి పూర్ణచంద్రరావు చేతుల మీదుగా భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక చింతన, భక్తి మార్గం వైపు అడుగులు వేయాలని, భగవద్గీతలోని విలువైన బోధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని జీవితంలో ఆచరించాలని ఆకాంక్షించారు.నేటి యువతలో ఆధ్యాత్మిక భావాలు, నైతిక విలువలు పెంపొందించడంతో పాటు ధర్మబద్ధమైన జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు భగవద్గీత ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలు శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, కొత్తపేట - కవ్వాల్‌లో భక్తులకు అందుబాటులో ఉంచబడతాయని,ఆసక్తి గల భక్తులు దేవస్థానాన్ని సందర్శించి భగవద్గీత పుస్తకాలను పొందవచ్చని తెలిపారు.యువత భక్తి మార్గంలో పయనిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలన్న సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో పీసీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకుల పాలాభిషేకం



నాగిరెడ్డిపేట,వుదయం

తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.873 కోట్ల నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 33 గ్రామ పంచాయతీల నూతన భవనాల నిర్మాణానికి VBG RAM G పథకం ద్వారా రూ.6.60 కోట్లు, నాబార్డు నిధుల ద్వారా 73 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.22.33 కోట్లు కేటాయించడంపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మడుపు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమాన్లు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బోయినీ బాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి కిషన్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి రాజు, బూత్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మేకల రాజు గోపాల్‌తో పాటు నాగరాజ్ గౌడ్, సిద్ధిరాములు, రాజు, ప్రశాంత్, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

జిల్లా కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతి గ్రామానికి త్రాగునీరు అందే విధంగా మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో త్రాగునీటి సరఫరా, పశుగ్రాసం పై తాసిల్దార్లకు, ఎంపీడీవోలు, మిషన్ భగీరథ ఇంజనీరింగ్, నీటిపారుదల శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావంతో భూగర్భ నీటిమట్టం తగ్గిపోవడంతో త్రాగు నీటి సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 15 నుండి డిసెంబర్ 31 వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి, చేతి పంపులు సింగిల్ పేజ్ మీటర్లు ,ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టాలన్నారు. త్రాగునీటిని వృధా చేయకూడదన్నారు. త్రాగునీటిని వృధా చేసే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. బోర్వెల్ రీఛార్జ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకులను సిద్ధం చేయాలన్నారు. వచ్చే వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలన్నారు. నీటి సమస్యపై సందేహాలు కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1916కు తెలపాలన్నారు. వి బి జి రాంజీ పథకం ద్వారా చెరువులు కాలువలలో పూడిక తీయాలన్నారు. పశుగ్రాసం ఇబ్బందులు రాకుండా పశు గ్రసం పెంచుటకు అవసరమైన ప్రదేశాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీటి సరఫరా పశుగ్రాసం పెంచటం ప్రతి మండలంలో సర్పంచులు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వాటర్ ప్లాంట్ లు యజమానులతో సమావేశం నిర్వహించి వృధా నీటిపై వివరించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిపిఓ బిక్షపతి ,డి ఆర్ డి ఓ దత్తరావు ,మిషన్ భగీరథ ఈఈ లు రాకేష్ ,సిద్ధిక్ తహసిల్దార్లు ,ఎంపీడీవోలు, నీటిపారు గల శాఖ, పశుసంవర్ధక శాఖ పాల్గొన్నారు.

ప్రాణం ఖరీదు కేవలం రూ.10 లక్షలేనా?

- నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోతుందా..?
- కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి భరోసా ఏది?





జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 05(వుదయం జిల్లా ప్రతినిధి)

ఇసుక రవాణా లారీల కారణంగా మరో కుటుంబంలో విషాదం నెలకొంది. బీరాసాగర్ ఇసుక క్వారీ వద్ద గత మూడు రోజుల క్రితం జరిగిన లారీ ప్రమాదంలో మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన పోత స్వామి మృతి చెందడం స్థానికంగా తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఇసుక రవాణా ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం ఆర్జిస్తున్న వ్యవస్థలో, ఒక నిండు ప్రాణం కోల్పోయిన కుటుంబానికి మాత్రం రూ.10 లక్షల నష్టపరిహారం ఇచ్చి సమస్యను ముగించాలనుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఒక కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి మృతి చెందితే ఆ కుటుంబ భవిష్యత్తు ఏమిటి? భార్యాపిల్లల జీవనాధారం ఎవరు కల్పిస్తారు? కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇతర అవసరాలకు ఆర్థిక భరోసా ఎవరు కల్పిస్తారు? కేవలం నష్టపరిహారం అందజేసినంత మాత్రాన ఆ కుటుంబానికి జరిగిన నష్టం పూడుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇసుక క్వారీల నిర్వహణ, లారీల రాకపోకలు, రవాణా భద్రత విషయంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు, బాధ్యత ఎంతవరకు ఉందనే అంశంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ఇసుక రవాణా లారీలతో ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోతుంటే సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడమే కాకుండా, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ప్రభుత్వంపై ఉందని విషయాన్ని గ్రహించాలని ప్రజలంటున్నారు.పోత స్వామి మృతి అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కుటుంబ సభ్యులు రాక ముందే మృతదేహాన్ని తరలించినట్లు వస్తున్న ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. మృతదేహాన్ని తరలించాల్సిన పరిస్థితులు ఏమిటి? కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాక కుటుంబ సభ్యులు వచ్చేదాకా ఎందుకు ఆగలేదు? ఈ పరిణామాల వెనుక ఉన్న వాస్తవాలేమిటి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ప్రాంతం నుంచి ఇసుక రవాణా ద్వారా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నప్పటికీ, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మాత్రం లక్షల రూపాయల పరిహారంతోనే న్యాయం జరిగిందని భావించడం సరికాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రాణానికి వెల కట్టడం సాధ్యమా? ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పోత స్వామి మృతి ఘటనను సాధారణ ప్రమాదంగా పరిగణించి వదిలేయకుండా, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, మృతుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం, దీర్ఘకాలిక ఆర్థిక భరోసా కల్పించాలని ఇసుక లారీల రాకపోకలపై కఠిన నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.ఒక కుటుంబానికి జరిగిన అన్యాయం మరో కుటుంబానికి జరగకుండా చూడాలని నష్టపరిహారం చెల్లించడం ఒక్కటే పరిష్కారం కాదు అని ప్రమాదాలకు బాధ్యత వహించే వారిని గుర్తించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయడమే అసలైన బాధ్యత అని ప్రజలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే పోత స్వామి మృతిచెందిన కొన్ని గంటల వరకు సంబంధిత శాఖల అధికారులు కాంట్రాక్టర్లు నిర్లక్ష్య ధోరణి వహిస్తూ మృతుని ప్రాణానికి విలువ లేదనే విధంగా వ్యవహరించారని బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సంఘీభావం తెలుపడంతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీపతి బాబు, కేదారి గీత, పోత వెంకటస్వామి, పలువురు నాయకులు మృతుని కుటుంబానికి అండగా నిలిచి న్యాయం చేయాలని గంటల తరబడి పోరాటం చేయడంతో అధికారులు కాంట్రాక్టర్లు స్పందించి మృతుని కుటుంబానికి 10 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్లు స్థానిక ప్రజల్లో చర్చలు జరుగుతున్నాయి. ఇసుక లారీ కింద పడి పోత స్వామి మృతి చెందిన గంటల తరబడి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ గంటల తరబడి నిర్లక్ష్యం వహించి ప్రతిపక్ష నాయకులు ఎంట్రీ ఇవ్వడంతో స్పందించడం ఏంటి అని అధికారులు కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుతో ప్రభుత్వ పాలనపై మచ్చ వచ్చే విధంగా ఉందని ప్రజలు పలు రకాలుగా అనుకుంటున్నారు.?

యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

మహాదేవపూర్ :నవంబర్ 05(వుదయం ప్రతినిధి)



రాష్ట్ర ఐటీ, వాణిజ్యం ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్ సూచనల మేరకు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్శవేని నగేష్ యాదవ్ నేతృత్వంలో మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామంలో గ్రామ యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని కాలేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బోగే దేవరాజ్, ఉపాధ్యక్షులుగా అద్దూరి వంశీ, ప్రధాన కార్యదర్శిగా మంద రాకేష్, కార్యదర్శిగా బందం విజయ్, కోశాధికారిగా బోగిరి శ్రీకాంత్, అధికార ప్రతినిధిగా జిముడా లక్ష్మి రాజీ, ప్రచార కమిటీ కన్వీనర్గా పాణిగంటి వెంకటేష్, తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నట్లు వెల్లడించారు.

ఎంపీ గడ్డం వంశీకృష్ణ బీఆర్ఎస్ నాయకులతో పర్యటనలు మానుకోవాలి

మంత్రి శ్రీధర్ బాబు కృషితోనే ఎంపీగా ఎన్నికయ్యారు

భూపాలపల్లి, నవంబర్ 05 (వుదయం విలేకరి):



పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటనలు మానుకోవాలని కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బుర్రి శివరాజ్ అన్నారు.గురువారం మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు భుజాలపై వేసుకొని గెలిపిస్తేనే ఎంపీగా ఎన్నికయ్యారని అన్నారు. మీరు ఎన్ని పార్టీలు మారినా మీకు అవకాశాలు ఇచ్చి గెలిపించింది కాంగ్రెస్ పార్టీయే అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఓట్లేసి గెలిపిస్తే, మిమ్మల్ని ఓడగొట్టాలని చూసిన బీఆర్ఎస్ నాయకులతో పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. కొయ్యూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ దళిత మహిళకు మీ పర్యటన సమాచారం తెలియజేయకపోవడం సరికాదని అన్నారు. మిమ్మల్ని పక్కకు పెట్టాలని మంత్రి శ్రీధర్ బాబు చూస్తే మంథని నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. మా మంత్రి శ్రీధర్ బాబు ఢిల్లీకి రాకున్నా ఆదేశాలిచ్చి సుమారు 100 మందికి పైగా ఢిల్లీ మీటింగ్కు పంపించారని, మీరు ఎంపీ అయి ఉండి కనీసం 10 మందిని కూడా ఢిల్లీకి తీసుకు రాలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఇలాంటి బురదజల్లే రాజకీయాలను మానుకొని, మీకు ఓటేసిన కార్యకర్తల, ప్రజల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బాను, మండల నాయకులు కోట సమ్మయ్య, దొడ్డ అశోక్, నయీం, రాఘవేంద్ర, అస్రార్ ఖురేషి, గారే శంకరయ్య, అయితే తిరుపతి రెడ్డి, లింగాల సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?..

- ఆరు గ్యారంటీల అమలుపై నిలదీత..
- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

పర్వతగిరి , నవంబర్ 05 (వుదయం ప్రతినిధి):



ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు.. ప్రజలకు ఎన్నో హామీలు.. అధికారంలోకి వచ్చాక వాటి అమలు విషయంలో మాత్రం నిర్లక్ష్యమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని గురువారం పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరూరి రమేష్ విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆయా హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలేవి?

రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి చూపాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. సాగు ఖర్చులు పెరిగి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల ప్రయోజనాలు అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆశలను నీరుగార్చకుండా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు.


మహిళలు, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు!

మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, పేద కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు యువతకు భరోసా ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు.

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు పలకాలని ఆరూరి రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఆరూరి రమేష్ స్పష్టం చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీల అమలుపై స్పష్టమైన వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై సమాధానం చెప్పేలా బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

తిమ్మంపేట పల్లె దవాఖానాలో వైద్యుడు అందుబాటులో ఉండాలి



- డాక్టర్ డిప్యూటేషన్ రద్దు చేసి రెగ్యులర్‌గా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి
- సర్పంచ్ మోడెం శ్రీలత

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 5.

